ప్రజాశక్తి

గురువారం 10 ఆగస్టు 2023

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

గాజువాకలోని దీక్షలో కూర్చున్న అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు

మోడీని ఓడించి దేశాన్ని రక్షించుకుందాం...

◆ క్విట్ మోడీ-సేవ్ ఇండియా దీక్షల్లో వక్తలు

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్, గాజువాక

క్విట్ ఇండియా స్ఫూర్తితో 'మోడీని ఓడిద్దాం- దేశాన్ని, ప్రభుత్వ రంగాన్ని రక్షించుకుందాం' అని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. అఖిలపక్ష కార్మిక సంఘాల పిలుపు మేరకు జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద బుధవారం చేపట్టిన "క్విట్ మోడీ - సేవ్ ఇండియా" దీక్షలను సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నరసింగరావు ప్రారంభించారు. ముందుగా గాంధీ విగ్రహానికి పూల మాల వేసి దీక్ష చేపట్టారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రభుత్వరంగ సంస్థల ప్రయివేటీకరణ విధానాలను ఆపాలని, లేబర్‌కోడ్స్ రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, స్కీమ్ వర్కర్స్‌ను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని, కనీస పెన్షన్ రూ.9 వేలు చెల్లించాలని, అసంఘటిత రంగ కార్మికులకు పిఎఫ్, ఇఎస్ఐ, ఇన్సూరెన్స్‌తో కూడిన సమగ్ర చట్టం చేయాలని, ఉద్యోగభద్రత కల్పించాలని, ఎంవి.యాక్ట్ 2019, జీవో 21ను, ఈ చలానాను రద్దుచేయాలని, రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, వ్యవసాయ కార్మికులకు గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని సంవత్సరానికి 200రోజులకు పెంచాలన్న డిమాండ్లతో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద 500 మందితో నిరసన దీక్షను చేపట్టారు. ఉదయం 10 గంటల ప్రారంభమైన దీక్ష సాయంత్రం ఐదు గంటల వరకు సాగింది.

దీక్షనుద్దేశించి సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ, నరేంద్రమోడీ ప్రభుత్వం అధికారంలో వచ్చినప్పటి నుంచి ప్రభుత్వరంగ సంస్థలన్నింటినీ తన ఆప్త మిత్రులైన అంబానీ, అదానీలకు కట్టబెడుతున్నారని విమర్శించారు. దేశంలో ఉన్న పోర్టులు, స్టీల్‌ప్లాంట్, విమానాశ్రయాలు,

మిగతా 2లో..

నిధులు దుబారా!

◆ నగర పాలకులు దృష్టి సారించేనా?

◆ 11న స్థాయీ సంఘ సమావేశం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

జివిఎంసిలో నిధుల దుబారా నానాటికీ పెరిగిపోతోంది. పాలకులు దృష్టిసారించకపోవడంతో ఇంజినీరింగ్ విభాగ అధికారులు సైతం కొంతమంది కార్పొరేటర్లతో కుమ్మక్కయి పనుల అనుమతులు ఇచ్చేయడం, నిధులను కొల్లగొట్టేయడం చేస్తున్నారు. కౌన్సిల్ సమావేశంలో ప్రతిపక్ష కార్పొరేటర్లు తమ వార్డుల్లో అభివృద్ధి పనుల నిధుల కోసం గగ్గోలు పెడుతున్నా పాలకులకు పట్టడం లేదు. కానీ దొడ్డిదారిన అధికార పక్షానికి చెందిన కొద్దిమందికి రూ.కోట్లు మంజూరు చేసేయడం విశేషం. అదీ కూడా కౌన్సిల్‌లో చాలా ఆర్థిక పరమైన విషయాలను తోసుకుంటూ వెళ్లిపోతున్నారు. స్థాయీ సంఘ సమావేశంలో పని కానిచ్చేసుకుంటున్నారు. స్థాయీ సంఘంలో ఇదే జరుగుతుందని రూ.కోట్లు ప్రజాధనం వృథా అయిపోతుందని పలువురు ఆందోళన చెందుతున్నట్లుగానే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇలా తాజాగా కొన్ని వెలుగులోకి వచ్చాయి. కొన్ని పనులకు ఎలాంటి పరిశీలన, పర్యవేక్షణ చేయకుండా నిధులు కైంకర్యం చేసేస్తున్నా పట్టించుకున్నపాపాన పోవడం లేదు. ఈ నెల 11వ తేదీన 11 గంటలకు స్థాయీ సంఘం సమావేశం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని స్థాయీ సంఘ సమావేశ భవనంలో జరుగనుంది. ఈ కమిటీ ఎదుటకు కొన్ని అక్రమాల విషయమై కొద్దిమంది అధికారులు ప్రస్తావించాలని భావిస్తున్నా రాజకీయ ఒత్తిడితో వెనకడుగు వేసే పరిస్థితులు నెలకొన్నాయి.

అక్కడే అన్ని నిధులా?

నగరంలోని 39వ వార్డు పాతబస్తీలోని డాక్టర్ డీన్ షాదీఖానా కల్యాణమండపం సహా 12 షాపులున్నాయి. ఇది పూర్తిగా మైనారిటీ సంక్షేమ శాఖ భవనం. గతంలో రూ.కోటి మంజూరు చేశారు. (రెండు రూ.50లక్షలు చొప్పున). దీంతో సహా ఉర్దూఘర్ రూమ్‌కు వసతుల కల్పన పేరుతో నిధులు రూ.లక్షలు గుమ్మరించేందుకు ఈనెల 11న జరుగున్న స్టాండింగ్ కమిటీ అనుమతులు ఇచ్చే దిశగా పయనిస్తోంది. వాస్తవానికి ఈ భవనం మైనారిటీ సంక్షేమ కార్పొరేషన్ శాఖ పరిధిలోకి వస్తుండగా జివిఎంసి నిధులను సుమారు మరో రూ.కోటి వెచ్చించడం కోసం ప్రయత్నాలు ముమ్మరం అయ్యాయి. ఇక్కడ తాజాగా మరో రూ.35.75 లక్షలతో ఏసీలు ఏర్పాటు, వంటగది, టైల్స్, ప్రహరీ, 12 ఏసీల కోసం జివిఎంసి పైన తెలిపిన నిధులను ఇచ్చేందుకు సిద్ధపడిందని తెలుస్తోంది. ఉర్దూ భవన్ అదనపు అంతస్తు పేరిట మరో రూ.40.06 లక్షలు మంజూరు చేయాలని స్థానిక కార్పొరేటర్ అధికారులపై మరలా తాజాగా ఒత్తిడి

మిగతా 2లో..

ఇద్దరు పిల్లలు సహా తల్లి అనుమానాస్పద మృతి

▶ వార్త మెయిన్ 3లో..

వచ్చే నెల 18 నుంచి అంతర్జాతీయ గోల్ఫ్ టోర్నీ

▶ వార్త 3లో..

మణిపూర్ హింసాకాండపై మోడీ స్పందించాలి

▶ వార్త 8లో..

వైఎస్ఆర్ కల్యాణమస్తు, షాదీ తోఫా పంపిణీ

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ, అనకాపల్లి : వైఎస్ఆర్ కల్యాణమస్తు, వైఎస్ఆర్ షాదీ తోఫా మూడో విడత నిధుల పంపిణీ బుధవారం జిల్లాస్థాయి కార్యక్రమం విశాఖ కలెక్టరేట్‌లో నిర్వహించారు. వైఎస్ఆర్ కల్యాణమస్తు, వైఎస్ఆర్ షాదీతోఫా క్రింద విశాఖ జిల్లాలో 681 మంది లబ్ధిదారులకు రూ.4.24 కోట్ల నమూనా చెక్కును వధువువరులకు ప్రజాప్రతినిధులతో కలిసి జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్ అందజేశారు. ఈ డబ్బులను లబ్ధిదారుల తల్లుల ఖాతాలో జమచేయనున్నట్లు జాయింట్ కలెక్టర్ వివరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, బాల్య వివాహాలను నివారించడం, పిల్లల చదువులను ప్రోత్సహించడం, పేద కుటుంబాలకు చెందిన వధువుల తల్లిదండ్రులను ఆర్థికంగా ఆదుకోవడమే ఈ పథకం ఉద్దేశ్యమన్నారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు పెందుర్తి నియోజకవర్గం సరిపల్లి గ్రామానికి చెందిన సిహెచ్.శ్రావణి, గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, ఎమ్మెల్సీ పండుల రవీంద్రబాబు, డిసిసిబి ఛైర్మన్ కోలా గురువులు, మైనారిటీ కార్పొరేషన్ ఛైర్మన్ జాన్ వెస్లీ, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఛైర్ పర్సన్ మంతెన మాధవి, నగరాల కార్పొరేషన్ ఛైర్ పర్సన్ పిల్లా సుజాత తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి జిల్లాలో రూ.6.78 కోట్లు

అనకాపల్లి : అనకాపల్లి జిల్లాలో 1133 జంటలకు రూ.6 కోట్లా 78 లక్షల 30 వేలు వైఎస్ఆర్ కల్యాణమస్తు ఆర్థిక సహాయం మంజూరు చేసినట్లు జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి వర్చువల్ కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి, జిల్లా పరిషత్ వైస్ ఛైర్‌పర్సన్ బి.వరాహసత్యవతి, డిఆర్‌డిఎ పీడీ లక్ష్మీపతి, సోషల్ వెల్ఫేర్ డీడీ అజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

అరకొరగా పాఠశాల గ్రాంటు

◆ ప్రధానోపాధ్యాయులపై నిర్వహణ భారం

◆ అవసరాలకు సొంత డబ్బులు ఖర్చు

ప్లాస్టిక్ డబ్బాలో పెట్టిన నీటిని తాగుతున్న బాలిక

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

"పాఠశాలలో 20 మంది పిల్లలున్నారు. పాఠశాల నిర్వహణ నిధులు ఏడాదికి రూ.25 వేలు రావాల్సివుంది. గతేడాది 20 శాతం అంటే రూ.5 వేలు ప్రభుత్వం విడుదల చేసింది. కరెంట్ బిల్లు రూ.7 వేలు దాటింది. ప్రభుత్వం ఇచ్చిన కాంపొనెంట్ గ్రాంట్ కరెంట్ బిల్లుకు కూడా సరిపోలేదు. సుద్దముక్కలు, పేపర్లు, తాగునీరు, పాఠశాల నిర్వహణ ఖర్చులకు జీతం డబ్బులు పెడుతున్నాను. ఈ విద్యా సంవత్సరంలో పైసా కూడా ఇవ్వలేదు". ఇదీ ఓ పాఠశాల ప్రధానోపాధ్యాయుని ఆవేదన.

వాస్తవానికి ఇది ఒక్క పాఠశాల ప్రాధానోపాధ్యాయుని ఆవేదన కాదు. జిల్లాలోని 1465 పాఠశాల ప్రధానోపాధ్యాయుల పరిస్థితి దాదాపు ఇలానే ఉంది. ఏటా విద్యార్థుల సంఖ్యను బట్టి సమగ్ర శిక్షా అభియాన్ ద్వారా పాఠశాల నిర్వహణ ఖర్చులు కేంద్ర ప్రభుత్వం విడుదల చేయాలి. పబ్లిక్ ఫైనాన్స్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (పిఎఫ్ఎంఎస్) కింద పాఠశాల ప్రధానోపాధ్యాయుల ఖాతాలో ఈ నిధులు జమకానున్నాయి. 2022-23లో దాదాపు రూ.3.92 కోట్లు నిర్వహణ ఖర్చుల కింద పాఠశాలలకు రావాల్సివుండగా రూ.78.47 లక్షలు ఇచ్చింది. ఈ నిధులు ఏడాది పాటు

మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

మోడీని ఓడించి దేశాన్ని రక్షించుకుందాం...

రైల్వేలు, జాతీయ రహదారులు, బ్యాంకులు, ఇన్స్యూరెన్స్, గనులు, అంతరిక్షం చివరికి సముద్రాన్ని కూడా ప్రయివేటీకరణకు పూనుకుంటున్నారన్నారు. 32మంది ప్రాణత్యాగాలతో ఏర్పాటైన విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రయివేటు వారికి కట్టబెట్టాలని ఎన్ని కుట్రలు చేస్తున్నా విశాఖపట్నం కార్మిక వర్గం 909 రోజుల నుంచి పోరాడుతూ అడ్డుకుంటున్నారని, ఇదే ఐక్యతతో భవిష్యత్తులో మోడీని ఓడించడానికి కార్మిక వర్గం సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు మంత్రి రాజశేఖర్, ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ, నాయకులు మన్మధరావు, రెహమాన్, ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు, మల్లన్న, సిఎఫ్‌టియు జాతీయ అధ్యక్షులు కనకారావు, ఎపిఎఫ్‌టియు నాయకులు దేవ, ఎఐసిటియు నాయకులు శంకరరావ, సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కెఎం శ్రీనివాసరావు, ఆర్‌కెఎస్‌వి.కుమార్, నాయకులు బి.జగన్, పి.మణి, అంగన్వాడీ జిల్లా అధ్యక్షులు తులసి, ఆశా యూనియన్ జిల్లా అధ్యక్షులు పద్మ, పోర్టు యూనియన్ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, మెటార్ యూనియన్ ప్రధాన కార్యదర్శి జి.అప్పలరాజు, క్యాబ్ యూనియన్ అధ్యక్షుడు శ్రీనివాస్, రైల్వే యూనియన్ నాయకులు అప్పారావు, షిప్ యార్డ్ యూనియన్ నాయకులు రాజు, ప్రసాద్, జివిఎంసి యూనియన్ నాయకులు నూకరాజు, యు.రాజు, ఇంటిపని వారి సంఘం నాయకులు కుమారి తదితరులు మాట్లాడారు.

స్టీల్‌ప్లాంట్ అధీనంలోనే గంగవరం పోర్టు ఉండాలి

గాజువాక : విశాఖ స్టీల్‌ప్లాంట్ అధీనంలోనే ఆదానీ గంగవరం పోర్టు ఉండాలని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ చైర్మన్ సిహెచ్ నర్సింగరావు డిమాండ్ చేశారు. బుధవారం క్విట్ మోడీ, సేవ్ వైజాగ్ స్టీల్ నినాదంతో పాత గాజువాక జంక్షన్‌లో నిరసన చేపట్టారు. క్విట్ మోడీ, సేవ్ వైజాగ్ స్టీల్ నినాదాలతో పాతగాజువాక హోరెత్తింది. ఈ సందర్భంగా నర్సింగరావు మాట్లాడుతూ, విశాఖ స్టీల్ ప్లాంట్‌ను దెబ్బతీయాలనే మోడీ ప్రభుత్వ కుట్రలో భాగంగా ఇప్పటికే ప్రయివేటీకరణ చర్యలు పూనుకోగా, తాజాగా స్టీల్‌ప్లాంట్‌కు చెందిన రూ.వెయ్యి కోట్ల విలువైన కుకింగ్ కోల్‌ను ఇవ్వకుండా గంగవరం పోర్టు సముద్రంలోనే నిలిపేశారన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను నిర్వీర్యం చేయాలన్న మోడీ ప్రభుత్వ దుశ్చర్యలను ఖండించాలన్నారు. ప్రయివేటుపరంగా ఉన్న అనేక సంస్థలను ప్రభుత్వరంగంలోకి మార్చిన సందర్భాలు అనేకం ఉన్నాయని, అదే విధంగా గంగవరం పోర్టును కూడా ప్రభుత్వంపరం చేయాలని డిమాండ్ చేశారు. ఒక్క పైసా తీసుకోకుండా స్టీల్‌ప్లాంట్ భూములను గంగవరం పోర్టుకు ఇచ్చిన విషయాన్ని మరువరాదన్నారు. విశాఖ పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్లు చైర్మన్ మంత్రి రాజశేఖర్, డి ఆదినారాయణ మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్ కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ప్రజాశాంతి పార్టీ అధినేత కెఎ.పాల్ మాట్లాడుతూ, మోడీని ఎదిరించే సత్తా రాష్ట్రంలో టిడిపి, వైసిపిలకు లేదన్నారు. పార్లమెంట్‌లో విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ వాణిని వినిపించేందుకు తాను విశాఖ నుంచి ఎంపీగా పోటీకి సిద్ధంగా ఉన్నానని, ప్రజలు గెలిపించాలని కోరారు. పవన్ కల్యాణ్ చేస్తున్న వారాహి యాత్ర మోడీ విజయ యాత్రలా ఉందని వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో కార్మికసంఘాల నేతలు అయోధ్యరాం, యు రామస్వామి, వైటి.దాస్, ఎన్.రామారావు, సత్యనారాయణ, జెర్రిపోతుల ముత్యాలు పాల్గొన్నారు.

నిధులు దుబారా!

తేవడంతో దీన్ని ఈనెల 11న స్థాయీ సంఘ సమావేశంలో ఆమోదానికి రంగం సిద్ధం చేసుకుంటున్నారు. స్థాయీ సంఘ సమావేశంలో 7వ అంశంగా రూ.35.75లక్షలు, 8వ అంశంగా రూ.40.06 లక్షల నిధుల ఆమోదానికి ఫైళ్లు కదిలించే దిశగా వ్యవహారాలు నడుస్తున్నాయి. జివిఎంసికి ఎలాంటి సంబంధం లేని ఈ 39వ వార్డులోని మైనారిటీ సంక్షేమ భవన వ్యవహారాలపై తలదూర్చడంపై అధికార పార్టీ కార్పొరేటర్లు సైతం గుర్రుగా ఉండడం కనిపిస్తోంది. స్థాయీ సంఘ సమావేశంలో రభస జరిగే అవకాశం లేకపోలేదు.

అరకొరగా పాఠశాల గ్రాంటు

పాఠశాల నిర్వహణ ఖర్చులకు చాలకపోవడంతో ప్రధానోపాధ్యాయులు తమ జీతం డబ్బులు ఖర్చు పెట్టారు. కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులంతా కలిసి నిర్వహణ ఖర్చులు సర్దుబాటుచేసుకున్నారు.

పాఠశాలల్లో సుద్దముక్కలు, కరెంట్ బిల్లు, పీరియాడికల్స్, పేపర్లు, తాగునీరు, ఇతర అవసరాలకు ఈ నిధులు వినియోగించాల్సివుంది. 2022-23 విద్యా సంవత్సరంలో 20 శాతం నిధులు విడుదల చేసిన ప్రభుత్వం, ఈ విద్యా సంవత్సరం 2023-24లో తొలి త్రైమాసక ఆరంభంలో కాంపొనెంట్ నిధులు ప్రభుత్వం విడుదలచేస్తోందని ప్రధానోపాధ్యాయులకు విద్యాశాఖాధికారలు భరోసా ఇచ్చారు. విద్యుత్ బిల్లులు కాంపొనెంట్ నిధుల్లో జమ చేసుకొని మిగిలిన సొమ్ము పాఠశాల ఖాతాల్లో జమచేస్తుందని చెప్పడంతో నిజమని నమ్మారు. ఈ విద్యా సంవత్సరం ప్రారంభించి రెండు నెలలు అవుతున్నప్పటికీ, ఇంతవరకు పైసా కూడా ప్రభుత్వం విడుదల చేయలేదు. దీంతో సుద్దముక్కలు, ఇతర అవసరాలకు ప్రధానోపాధ్యాయులు తమ సొంత డబ్బులు ఖర్చుపెడుతున్నారు. ఈ డబ్బులు ఎప్పుడు వస్తాయో, లేదో విద్యాశాఖాధికారులు చెప్పలేకపోతున్నారు.

పాఠశాల గ్రాంట్ విడుదల ఇలా...!

కాంపొనెంట్ స్కూల్ గ్రాంట్ కింద 15 నుంచి వంద మంది పిల్లలకు ఏడాదికి రూ.25వేలు, 101 నుంచి 250 మంది పిల్లల వరకు రూ.50వేలు, 251 నుంచి వెయ్యి మంది పిల్లల వరకు రూ.75వేలు, వెయ్యికిపైగా విద్యార్థులున్న పాఠశాలకు లక్ష రూపాయలు విడుదల చేయాల్సివుంది.

నేటి నుంచి విశాఖలో వారాహి విజయయాత్ర

ప్రజాశక్తి-కలెక్టరేట్ (విశాఖ) : జనసేన మూడో విడత వారాహి విజయయాత్ర గురువారం నుంచి ఈ నెల 19వ తేదీ వరకు విశాఖలో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి టి.శివశంకర్ వెల్లడించారు. నగరంలోని ఒక హోటల్‌లో బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గురువారం మధ్యాహ్నం పవన్ కల్యాణ్ వైజాగ్ చేరుకుంటారని, సాయంత్రం 5 గంటలకు జగదాంబ జంక్షన్ వద్ద వారాహి వాహనంపై నుంచి ప్రసంగిస్తారని తెలిపారు. వైసిపి పాలనలో ఉత్తరాంధ్రకు జరిగిన దోపిడీని వివరిస్తారని చెప్పారు. ఈ నెల 19వ తేదీ వరకూ ఉమ్మడి విశాఖ జిల్లాలోనే పర్యటన ఉంటుందని పేర్కొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు మాట్లాడుతూ, వారాహి యాత్ర వల్ల ఎక్కడా ప్రజలకు, శాంతి భద్రతలకు ఇబ్బంది ఉండకుండా ఏర్పాట్లు చేశామన్నారు. పవన్ కల్యాణ్ రాక సందర్భంగా విశాఖ విమానాశ్రయం నుంచి దసపల్లా హోటల్ వరకు భారీ ర్యాలీ ఉంటుందన్నారు. ఈ సమావేశంలో పిఎసి సభ్యుడు కోన తాతారావు, మూగి శ్రీనివాసరావు, సంకు వెంకటేశ్వరరావు, వలివిరెడ్డి సతీష్, పీలా రామకృష్ణ, బొలిశెట్టి శ్రీకాంత్, పైడికొండ సునీల్, ముసలయ్య, గుంటూరు నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వారాహి యాత్ర ఒక వెబ్ సిరీస్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఉత్తరాంధ్ర ప్రజలకు న్యాయం చేస్తానని పవన్ కల్యాణ్ చేపట్టిన వారాహి విజయ యాత్రను వెబ్ సిరీస్‌గా మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పేర్కొన్నారు. సర్క్యూట్ హౌస్‌లో బుధవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో అమర్‌నాథ్ మాట్లాడుతూ, సినీ రంగ ప్రవేశానికి విశాఖలోనే ఓనమాలు దిద్దుకున్న పవన్ కల్యాణ్ విశాఖ నగరానికి చెందిన ఆడబిడ్డను పెళ్లి చేసుకుని వదిలేసి 15 ఏళ్ల కిందటే ఈ ప్రాంతానికి అన్యాయం చేశాడని విమర్శించారు. గతంలో ఈ ప్రాంత సమస్యలపై తాము అనేక పోరాటాలు చేసామని, అప్పుడు పవన్‌కల్యాణ్ ఏమయ్యాడని ప్రశ్నించారు. విశాఖలో చంద్రబాబు అనుచరులు భూములను ఆక్రమించుకున్నప్పుడు పవన్ ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. బిజెపితో పొత్తులో ఉన్న పవన్ కల్యాణ్ విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ విషయంలో మౌనంగా ఉన్నారన్నారు. బిజెపితో సంసారం, బాబుతో సహజీవనం చేస్తూ రాష్ట్ర అభివృద్ధికి అడ్డుపడుతున్నాడని వ్యాఖ్యానించారు.

జగన్మోహన్ రెడ్డిది నియంతృత్వ పాలన : పల్లా

ప్రజాశక్తి-కలెక్టరేట్ (విశాఖ) : ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిది నియంతృత్వ పాలన అని మాజీ ఎమ్మెల్యే, టిడిపి విశాఖ పార్లమెంట్ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు విమర్శించారు. టిడిపి కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, జగన్ దురాగతాలకు అడ్డూ అదుపూ లేకుండా పోతోందని, చట్టాన్ని తన చేతుల్లోకి తీసుకుని నియంత పాలన చేస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు చేపట్టిన పెన్నానది నుంచి వంశధార యాత్రకు విశేష ప్రజాదరణ లభిస్తోందని, అది చూసి ఓర్వలేక తప్పుడు కేసులు పెట్టారని ఆరోపించారు. వైసిపి ప్రభుత్వం పెట్టిన కేసులను వెనక్కి తీసుకోవాలని డిమాండ్‌చేశారు. సుజల స్రవంతి ప్రాజెక్టులను నిర్వీర్యం చేశారన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలే తగ్గిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

మార్షల్ ఆర్ట్స్‌లో ఆంధ్రా విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : కురుక్షేత్రలో ఈ నెల 4, 5, 6 తేదీలలో జరిగిన మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ పోటీలలో ఆంధ్రా విద్యార్థులు సత్తా చాటారు. విశాఖపట్నం నుంచి న్యూ ఇండియన్ టైక్వాండో క్లబ్ విద్యార్థులు ఆంధ్రప్రదేశ్ తరపున నేషనల్ ఓవర్ అల్ చాంపియన్‌షిప్‌లో ద్వితీయ స్థానం సాధించారని న్యూ ఇండియన్ టైక్వాండో క్లబ్ కోచ్ యశోద రావు తెలిపారు. జాతీయస్థాయి పోటీల్లో శ్రీవిశాగ్ అద్భుత ప్రదర్శన చేసి టైక్వాండో కరోగి, పూమ్సే, కిక్ బాక్సింగ్, వుషు నాలుగు బంగారు పతకాలు సాధించారని, ఎం లక్ష్మి, జి మురళి మనోహర్, ఎం చాందిని, ఎన్ శ్రీఇషిత, మూడు విభాగాల్లో బంగారు పతకాలు సాధించగా, ఎ.రాహుల్ బాబు, కెవివి సాత్విక్, ఇ.లిఖిత్ రెండు బంగారు, ఒక వెండి పతకాలు, కె జస్వంత్ రామ్, ఇ.మోక్షిత్ ఒక బంగారు, రెండు వెండి పతకాలు సాధించారని పేర్కొన్నారు. వచ్చే నెలలో నేపాల్‌లో జరిగే అంతర్జాతీయ పోటీలకు వీరు ఎంపికైనట్టు యశోదరావు తెలిపారు.

అర్హులందరూ ఓటరుగా నమోదు కావాలి

ప్రజాశక్తి- కలెక్టరేట్ (విశాఖ) : అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేయించుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్ సూచించారు. దక్షిణ నియోజకవర్గంలోని వెలంపేట పరిధి 91, 98 నెంబరు పోలింగ్ బూత్ పరిధిలో బుధవారం చేపట్టిన ఇంటింటికి ఓటరు సర్వే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బిఎల్‌ఓలు ఇంటింటికీ వచ్చినప్పుడు ఓటరు వివరాలు, డోర్ నెంబరు సరిగా ఉన్నది, లేనిది ఓటర్లు అడిగి తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ హుస్సేన్‌సాహెబ్, మహారాణిపేట తహశీల్దార్ టి.ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.

ఇంటింటి ఓటర్ల సర్వే 51.46 పూర్తి

ఎంవిపి కాలనీ : ఓటర్ల జాబితా ఇంటింటి సర్వే ప్రక్రియ ఇంతవరకు 51.46 శాతం పూర్తయిందని జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాధన్ తెలిపారు. బుధవారం సాయంత్రం తమ ఛాంబర్లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఇంటింటి సర్వేపై సమావేశం నిర్వహించారు. ఈ నెల 21వ తేదీ నాటికి జిల్లాలో ఇంటింటి సర్వే పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. దీనికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

బాలలను పరామర్శించిన సీతారాం

ప్రజాశక్తి-కలెక్టరేట్ (విశాఖ) : ముడసర్లోవ ప్రభుత్వ బాలుర పరిశీలనా గృహంలో కొట్లాటలో గాయపడి కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్న ఐదుగురు బాలలను ఆంధ్రప్రదేశ్ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం బుధవారం పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులనడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు.

ఉచిత వైద్య, రక్తదాన శిబిరాలు

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ద్వారకానగర్ రీజనల్ కార్యాలయంలో బ్యాంక్ వ్యవస్థాపకులు సొరాజ్జీ పోచానావాలా జయంతి సందర్భంగా ఉచిత వైద్య, రక్తదాన శిబిరాలు నిర్వహించారు. కస్టమర్లకు, సిబ్బందికి బిపి, జిఆర్‌బిఎస్, నేత్ర, దంత సమస్యలు, ఇసిజి పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా రీజనల్ హెడ్ నరేష్‌కుమార్ అహిర్వార్ మాట్లాడుతూ, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అతి తక్కువ వడ్డీ రేట్లుకే కస్టమర్లకు సేవలను అందిస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో చీఫ్ మేనేజర్లు కె.హేమంత్ కుమార్, ఆదిల్ రెహమాన్, నవీన్‌జా, బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

శాంతిని కోరుతూ నాగసాకి దినం

ప్రజాశక్తి-కలెక్టరేట్ (విశాఖ) : అణు బాంబుల తయారీని ప్రపంచ దేశాలన్నీ ముక్తకంఠంతో ఖండించినప్పుడే శాంతి వర్ధిల్లుతుందని వక్తలు అభిప్రాయపడ్డారు. గ్లోబల్ నెట్‌వర్క్, ఇస్కఫ్, సోషల్ మీడియా క్లబ్ సంయుక్తంగా జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నాగసాకి దినోత్సవం నిర్వహించారు.

శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి హుండీ ఆదాయం రూ.19 లక్షలు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (విశాఖ) : బురుజుపేటలోని శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం హుండీ ఆదాయం రూ.19 లక్షలు వచ్చిందని దేవస్థానం కార్యనిర్వహణ అధికారి కె.శిరీష తెలిపారు. జులై 10 నుంచి ఆగస్టు 9వ తేదీ వరకు అమ్మవారి దేవస్థానానికి హుండీ ద్వారా వచ్చిన ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. నగదు రూపంలో రూ.19.36 లక్షలు, బంగారం 77 గ్రాముల 100 మిల్లీ గ్రాములు, వెండి 320 గ్రాముల 200 మిల్లీగ్రాములు, కొంత మొత్తంలో విదేశీ కరెన్సీ వచ్చినట్లు శిరీష తెలిపారు. లెక్కింపు కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్మన్ కె.సింహాచలం, ధర్మకర్తలు బొదిలపాటి సత్య రూపవాణి, ఎన్ఎస్ఎస్ సుబ్రహ్మణ్యం, ఎస్.సురేష్, ఎం.ధనలత, వి.మారుతిప్రసాద్, ఆలయ సహాయకార్యనిర్వహణాధి కె.తిరుమలేశ్వరరావు, కార్యనిర్వహణాధికారి ఎ.జగన్నాధరావు, మొట్టమర్రి చిన్న సన్యాసయ్య, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సహాయ మేనేజర్ టి.ప్రశాంత్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపులో పాల్గొన్న శిరీష తదితరులు

మహారాజశ్రీ అనకాపల్లి ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S 319/2022

బిట్వీన్ :
వంకాయల విశ్వనాధం ...వాది
అండ్ :
పాతాళ మోహనరావు ...ప్రతివాది

దావా సమను

టు,
పాతాళ మోహనరావు,
S/o ఎరుకునాయుడు,
వయసు 42 సం॥లు, కొండవానిపాలెం విలేజ్, H/o చీపురుపల్లి విలేజ్,
పరవాడ మండలం, అనకాపల్లి జిల్లా.

పై నెంబరు దావాలో శ్రీ కోర్టువారు పంపిన సమన్లు మీరు అందుకోనందున సదరు కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **16-8-2023 తేదీకి** వాయిదా వేసియున్నారు. కావున ఆ రోజు **ఉ.10:30 ని॥లకు** మీరు స్వయంగా గాని లేక మీ తరుపున లాయరు గారు గాని పై కోర్టులో హాజరై మీకు గల ఆక్షేపనలు తెలుపుకొనవలెను లేనిచో మీ పరోక్షమందు పై దావా తీర్మానించబడును.

జి.నాగేశ్వరరావు,
అడ్వకేట్, అనకాపల్లి.

BEFORE THE HONOURABLE COURT OF PRL.JUNIOR CIVIL JUDGE AT ANAKAPALLE
E.P.NO.15/2021 IN DISPUTE NO.246/2020

Between:
M/s. Margadarsi Chit Fund Pvt. Ltd..
ANAKAPALLE Branch-531001.
Reo. by its Foreman/ Branch Manager
...PETITIONER / DHR

And :
MR.SHEIK RAFI AND 3 OTHERS
...RESPONDENTS / JDR'S

To
JDH-43 Mr.Kosana Venkatarao.
S/o.K.Appala Swamy, Aged-53 years.
W/As: Record Asst..Emp.No.8109.
Dept.of Marine Engineering College of Engineering, Andhra University, Visakhaptnam-530003.
R/at D.No.9-9-57.Near Kala Bharathi, Managapuram Colony.Vizag-17.

NOTICE

Please take notice that the above E.P. was as filed against you for Recovery of Rs.1,78,068/- (Rupees One Lakh Seventy Eight Thousand and Sixty Eight Only) and the same is posted to **24-08-2023 at 10-30 A.M** for your appearance Before the Honourable Court of Pr1.Junior Civil Judge Court at Main Road, Anakapalle-531001 in the above Court at 10:30 A.M. If you fail to attend before the Honourable Court on that day, the matter will be heard and decided exparty.

(BY ORDER OF THE PRL.JUNIOR CIVIL JUDGE AT ANAKAPALLE)

B.V.R.JOGARAO,
ADVOCATE
FOR DHR COMPANY,
ANAKAPALLE.

ANAKAPALLE
DATE : 09-08-2023

అణ్వస్త్ర రహిత ప్రపంచంపై అవగాహన

ప్రజాశక్తి-సీతమ్మధార : అణ్వాస్త్రాలు వద్దు, అన్నం, వస్త్రాలు వడ్డించండి అన్న నినాదంతో నాగసాకి సంస్మరణ దినోత్సవాన్ని అక్కయ్యపాలెం వాగ్దేవి ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఆవరణలో నిర్వహించారు. జపాన్‌లోని హిరోషిమా, నాగసాకి పట్టణాలపై అణుబాంబు దాడులు జరిగి 78 ఏళ్లు పూర్తయిన సందర్భంగా బుధవారం నాగసాకి సంస్మరణ దినం ఫోటో ప్రదర్శన నిర్వహించారు. అణ్వాయుధాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. అణ్వస్త్ర రహిత ప్రపంచం.కావాలని కోరుతూ బి.వి.ఫౌండేషన్ ఫర్ పీస్ అండ్ హార్మనీ, ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలీజియస్ ఫ్రీడమ్ సంయుక్త అధ్వర్యంలో నిర్వహించిన ఫోటో ప్రదర్శనను పారిశ్రామికవేత్త భరణికాన రామారావు ప్రారంభించారు. చైర్మన్ నరవ ప్రకాశరావు మాట్లాడుతూ హిరోషిమా,నాగసాకి దినోత్సవాల సందర్భంగా పలు విద్యాలయాల్లో అణ్వస్త్ర రహిత ప్రపంచం ఆవశ్యకతపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించామన్నారు. వాణిజ్య పన్నుల శాఖ మాజీ అధికారి నాయుడు, .ప్రిన్సిపల్ .సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపల్ శైలజ పాల్గొన్నారు.

నేడు నులిపురుగుల నివారణ దినోత్సవం

ప్రజాశక్తి- సీతమ్మధార : జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా ఈ నెల 10న గురువారం 19ఏళ్లలోపు విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు అందిస్తామని డిఎంహెచ్‌ఒ డాక్టర్ పి జగదీశ్వరరావు తెలిపారు. బుధవారం తన కార్యాలయంలో దీనికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, ఒకటి,రెండేళ్ల పిల్లలకు మాత్రలో ముక్కను, మూడేళ్ల పైబడి 19ఏళ్లలోపు వారికి ఒక్కో మాత్రను మధ్యాహ్న భోజనం తర్వాత అందించి, వారితో చప్పరించేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు అలాగే గర్భిణులకు ఆల్బెండజోల్ 400 ఎంజి మాత్రలు ఇస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా 4, 73, 358 మాత్రలను ఇప్పటికే 1900 పాఠశాలలు, 62 జూనియర్ కాలేజీలు, 742 అంగన్వాడీ కేంద్రాలకు అందజేసేలా సమీపంలోని హెల్త్‌సెంటర్లకు పంపిణీ చేశామన్నారు. లక్ష మాత్రలు అదనంగా ఉన్నట్లు తెలిపారు. డాక్టర్ సమత పాల్గొన్నారు.

సర్పంచ్ స్థానానికి రెండు నామినేషన్లు

ప్రజాశక్తి -భీమునిపట్నం :మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ సర్పంచ్ స్థానానికి జరుగుతున్న ఉప ఎన్నికకు బుధవారం రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. జగదీశ్వరరావు లచ్చుభుక్త, లక్ష్మి లచ్చుభుక్త నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. అలాగే టి నగరపాలెం పంచాయితీ 10 వ వార్డు స్థానానికి పూసర్ల రామారావు నామినేషన్ పత్రం దాఖలు చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె రాజేష్ పట్నాయక్‌కు అందజేశారు

పట్టపగలే విద్యుత్ వెలుగులు

ప్రజాశక్తి-సింహాచలం: జివిఎంసి 98వ వార్డు కృష్ణానగర్‌పాలెం ప్రాంతాలలో స్విచ్ ఆఫ్ బటన్ పని చేయకపోవడంతోకొద్దిరోజులుగా విద్యుత్ దీపాలు పగలు రాత్రి తేడా లేకుండా వెలుతూనే ఉన్నాయి. అధికారులు వెంటనే స్పందించి తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

వచ్చే నెల 18నుంచి అంతర్జాతీయ గోల్ఫ్ టోర్నీ

విశాఖ చరిత్రలో మొట్టమొదటిసారిగా ఇంటర్నేషనల్ గోల్ఫ్ ఈవెంట్ నిర్వహణ

మాట్లాడుతున్న ఈస్ట్ పాయింట్ గోల్ఫ్ క్లబ్ సభ్యులు

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాఖ చరిత్రలో మొట్టమొదటి సారిగా అంతర్జాతీయ గోల్ఫ్ టోర్నమెంట్‌ను వచ్చేనెల 18 నుంచి 23 వరకూ నగరంలోని ముడసర్లోవ ఈస్ట్‌పాయింట్ గోల్ఫ్ మైదానంలో నిర్వహించనున్నట్లు ఈస్ట్ పాయింట్ గోల్ఫ్ క్లబ్ వైజాగ్ గౌరవ కార్యదర్శి ఎంఎస్ఎన్.రాజు తెలిపారు. బుధవారం ముడసర్లోవ క్లబ్‌లో విలేకర్లతో మాట్లాడుతూ, 1984లో ఈస్ట్ పాయింట్ కాలనీ (ఉడా పార్కు) వద్ద స్థాపించిన ఈస్ట్ పాయింట్ గోల్ఫ్ క్లబ్‌కు ముడసర్లోవ వద్ద గల ప్రభుత్వం 100 ఎకరాలు కేటాయించిందని గుర్తు చేసారు. 2021లో ఛాంపియన్‌షిప్ గోల్ఫ్ క్లబ్‌గా ప్రపంచ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దామన్నారు. వచ్చేనెల 18 నుంచి ప్రారంభమయ్యే పిజిటిఐ టోర్నమెంట్‌లో భారత్‌తోపాటు శ్రీలంక, నేపాల్, బంగ్లాదేశ్ నుంచి మొత్తం 126 మంది ఉత్తమ గోల్ఫ్ ఆటగాళ్ళు పాల్గొంటారన్నారు. ఈ అధికారిక ప్రపంచ గోల్ఫ్ ఆటలో వచ్చిన ర్యాంకింగ్ పాయింట్స్ ఒలింపిక్ ప్రపంచ ఈవెంట్స్‌కి అర్హత సాధించేందుకు దోహదపడతాయన్నారు. ఈ టోర్నీని యూరో స్పోర్ట్స్, సోషల్ మీడియా స్ట్రీమింగ్ ఎబిసి న్యూస్ దూరదర్శన్ ప్రత్యక్ష ప్రసారం చేస్తాయన్నారు. ఈ టోర్నమెంట్ నగరంలో ఆతిధ్యం, పర్యాటక రంగాన్ని ప్రోత్సహిస్తూ దేశంలో ఉన్న పారిశ్రామిక సంస్థలను ఆకర్షించేవిధంగా ఉంటుందన్నారు. సమావేశంలో మార్కెటింగ్ టూర్ విభాగం హెడ్ వికాస్ సింగం, కోశాధికారి పి.రామకృష్ణారావు, సభ్యులు పివిఎల్ఎన్.రాజు, టికె.రాజు, ఎన్‌విహెచ్ రాజేంద్ర, డిటి.రావు, జి.విజయ్ కుమార్, డి.కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

గద్దర్‌కు ఘననివాళి

గద్దర్‌కు నివాళులర్పిస్తున్న శ్రీనివాసరావు, దళిత నేతలు

ప్రజాశక్తి -గాజువాక : కూర్మన్నపాలెం దళిత కులాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ప్రజా కళాకారుడు, దళిత ఉద్యమనేత మాటూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఉడానగర్ ఫేజ్-1 ఫంక్షన్ హాల్‌లో బుధవారం గద్దర్ సంతాప సభ నిర్వహించారు. గద్దర్ చిత్రపటానికి శ్రీనివాసరావు తదితరులు పూలమాలలు వేసి నివాళ లర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, గద్దర్ పాడిన విప్లవ గీతాలు ప్రజలను ఎంతో చైతన్య పరిచాయని, బహుజన రాజ్యాధికారం కోసం, గద్దర్ ప్రజా పార్టీని స్థాపించారన్నారు. శరీరానికి ఎన్నో బుల్లెట్లు తగిలినా, ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లిన గొప్ప ధైర్యశాలి గద్దర్ అని కొనియాడారు. గాలి ఆనంద్, బలిరెడ్డి నాగేశ్వరరావు, బి.ఎ.స్వామి, డాక్టర్ జొన్నకూటి విజయ్‌కుమార్,, కొల్లి రవికుమార్ దాస్, ఎన్.వి. రమణ, బత్తిని సత్తిబాబు, మండే సత్యనారాయణ పాల్గొన్నారు.

సంపూర్ణ పారిశుధ్యానికి ప్రజా సహకారం అవసరం

ప్రజాశక్తి- ములగాడ : జివిఎంసి 61వ వార్డు జనతాకాలనీ గెడ్డలో పూడిక తొలగింపు పనులను బుధవారం వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలంతా స్వచ్ఛతపై అవగాహన పెంచుకుని ఇంట్లోని తడి,పొడి, ప్రమాదకరమైన చెత్తను ఎక్కడికక్కడే పడేయకుండా, ఇంటింటికీ వచ్చే జివిఎంసి వాహనానికి అందించాలని సూచించారు. అలా కాకుండా రహదారులు, కాలువల్లో వేయరాదన్నారు. కొందరు అవగాహనా రాహిత్యంగా కాలువలలో వేస్తున్న వ్యర్థాల వల్ల వాడిక, వర్షపునీరు నిల్వ ఉండి దోమలకు ఆవాసంగా, వ్యాధులకుహేతువుగా మారుతోందన్నారు. స్వచ్ఛత యాప్ ద్వారా ఓటింగ్‌లో పాల్గొని స్వచ్ఛసర్వేక్షణ్ పోటీలలో విశాఖకు మొదటి ర్యాంకు తెచ్చేందుకు సహకరించాలన్నారు. వార్డు శానిటరీ ఇనిస్పెక్టర్ డి రవికుమార్, సూపర్ వైజర్ నూకరాజు పాల్గొన్నారు.

వారాహి యాత్ర విజయవంతానికి పూజలు

తొలి పావంచా వద్ద నినాదాలు చేస్తున్న జనసేన కార్యకర్తలు

ప్రజాశక్తి- సింహాచలం : విశాఖపట్నం జగదాంబ సెంటర్లో ఈనెల 10న గురువారం ప్రారంభం కానున్న వారాహి యాత్ర విజయవంతం కావాలని కోరుతూ జనసేన నేతలు మజ్జి సూరిబాబు ఆధ్వర్యంలో సింహాచలం తొలిపావంచా వద్ద బుధవారం ప్రత్యేక పూజలుచేశారు. నూట ఒక్క కొబ్బరికాయలు కొట్టారు. కార్యక్రమంలో మంచి సూరిబాబు, శ్రీను బాబు, శ్రీను సాయి, మధు, ముద్దాడ చైతు, దాసరి మురళి, దాసరి సోమరాజు, బాలి రంగా, ప్రసాద్ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

లారీ ఢీకొని కార్మికుడు మృతి

ప్రజాశక్తి-రాంబిల్లి : లారీ ఢీకొని ఎస్ఇజెడ్‌లో కార్మికుడు మృతి చెందిన సంఘటన బుధవారం ఉదయం లారస్ కంపెనీ సమీపంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... మండలంలోని లాలం కోడూరు గ్రామానికి చెందిన లాలం సన్యాసిరావు, లక్ష్మి కుమారుడు లాలం కిరణ్ (25) ఎస్ఇజెడ్‌లో పని చేస్తున్నాడు. మంగళవారం నైట్ సి షిఫ్ట్ ముగించుకొని బుధవారం ఉదయం స్వగ్రామానికి తిరిగి వస్తుండగా లారస్ కంపెనీ దగ్గర ఇసుక లారీ ఆయన్ను ఢీ కొట్టింది. తీవ్రంగా గాయపడిన కిరణ్‌ను అనకాపల్లి ఎన్టీఆర్ హాస్పిటల్‌కు తరలించగా, అప్పటికే మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి -నక్కపల్లి : నక్కపల్లి జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. మండలంలోని న్యాయంపూడి గ్రామానికి చెందిన రెడ్డి బాబూరావు హెటిరో కంపెనీలో కార్మికుడిగా పని చేస్తున్నాడు. బైక్‌పై ఉదయం కంపెనీకి వెళుతూ ఆసుపత్రి జంక్షన్ వద్ద రోడ్డు దాటుతుండగా, అదే మార్గంలో వెనుక నుండి వస్తున్న వేదుళ్ళపాలెం గ్రామానికి చెందిన విశ్రాంతి ఆర్మీ ఉద్యోగి గణేష్ బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇరువురి తలలకు తీవ్ర గాయమైంది. స్థానిక ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం విశాఖ తరలించారు.

జువైనల్ హోంలో కొట్లాట -ఇద్దరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - ఆరిలోవ : దీనదయాల్‌పురం దరి ప్రభుత్వ బాలుర పరిశీలన గృహం(జువైనల్‌)లో బుధవారం ఉదయం ఇరువర్గాల బాలుర మధ్య గొడవ జరిగింది. అది చిలికిచిలికి కొట్లాటకు దారి తీసింది. ఈ ఘటనలో ఐదుగురికి గాయాలుకాగా, ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. జువైనల్ హోం పర్యవేక్షణాధికారి వీరయ్య తెలిపిన వివరాలివి. జువైనల్ హోమ్‌కు మంగళవారం రాత్రి నగరానికి చెందిన ఐదుగురు బాలురిని తీసుకొచ్చారు. బుధవారం ఉదయం అల్పాహారం కోసం పాత, కొత్తవారిని డార్మెట్ హాల్‌లోకి తీసుకెళ్లగా, అక్కడ కొత్తగా వచ్చిన ఐదుగురు బాలురితో పాత బాలురు గొడవ పడ్డారు. మాటమాట పెరిగి కొట్లాటకు దారితీసింది. ప్లేట్లుతో ఒకరినొకరు కొట్టుకున్నారు. దీంతో కొత్తగా వచ్చిన బాలురిలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. జువైనల్ హోంలోనిఫర్నీచర్‌ను, సిసి కెమెరాలను ధ్వంసం చేసారు. గృహం సిబ్బంది ఆరిలోవ పోలీసులకు ఫిర్యాది చేయగా, . వెంటనే ఆరిలోవ ఎస్ఐలు సూర్యనారాయణ, అనిల్ కుమార్‌లు సంఘటన స్థలానికి చేరుకొని కొట్లాటను ఆపేందుకు ప్రయత్నించారు. కొట్లాటలో ఉన్న బాలురు, పోలీసుల మీదకు కూడా తిరగబడే ప్రయత్నం చేసారు. గాయపడ్డ బాలురిని చికిత్స నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు.

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం

- పాండ్రంగిలో రూ.ఐదు లక్షల ఆస్తి నష్టం

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని పాండ్రంగి గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం జరిగింది. గ్రామానికి చెందిన గంగిరెడ్ల కుటుంబాలకు చెందిన కృష్ణ అప్పలనాయుడు, సురేష్, బంగారునాయుడు, సూర్యనారాయణలకు చెందిన రెండు ధాన్యం, పుర్లు రెండు గడ్డివాములు, ఇంట్లో వంట సామగ్రి సర్వం అగ్నికి ఆహుతైంది. కోళ్ల సజీవ దహనమయ్యాయి. అర్ధరాత్రి ప్రమాదం కావడంతో బాధితులు కట్టుబట్టలతో మిగిలిపోయారు. సుమారు రూ.ఐదు లక్షల ఆస్తినష్టం జరిగిందని అంచనా వేస్తున్నారు. ప్రమాదంపై విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చినా వెంటనే స్పందించలేదని పిపిఎస్ అధ్యక్షుడు ఎ.అప్పారావు, స్థానిక నేతలు అంటున్నారు.

అప్పన్న సన్నిధిలో ఎమ్మెల్యే గణబాబు

ప్రజాశక్తి-సింహాచలం: సింహాద్రి అప్పన్నను బుధవారం పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే పెతకంశెట్టి గణబాబు దంపతులు దర్శించుకున్నారు. వీరికి ఆలయ పర్యవేక్షకులు సునీల్‌వర్మ ఆలయ సాంప్రదాయ ప్రకారం సాధనంగా స్వాగతం పలికారు.ఆలయంలో గోత్రనామాలతో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆస్థాన మండపంలో వేదపండితులు ఆశీర్వదించగా, అధికారులు స్వామివారి చిత్రపటాన్ని ప్రసాదాన్ని అందించారు.

పలు గ్రామాల్లో 'నా భూమి- నా దేశం'

ఆనందపురంలో మాజీ సైనికుడిని సత్కరిస్తున్న డిపిఒ, సర్పంచ్

ప్రజాశక్తి- ఆనందపురం : ఆజాదీ కా అమృతోత్సవ్‌లో భాగంగా మండలంలోని ఆనందపురం పంచాయతీ పొడుగుపాలెం, లొడగలవానిపాలెం పంచాయతీ కేంద్రాల్లో ఆయా పంచాయతీల సర్పంచ్‌లు చందక లక్ష్మి, లొడగల రాజేశ్వరి అధ్యక్షతన 'నా భూమి- నా దేశం' కార్యక్రమం నిర్వహించారు. జిల్లా పంచాయతీ అధికారి ఎవిఎ శ్రీనివాసరావు పాల్గొని 'నా భూమి నా దేశం' ఆవశ్యకతను వివరించారు.ఆయా పంచాయతీల నుంచి మట్టిని సేకరించి ఢిల్లీ పంపనున్నట్లు వెల్లడించారు. పొడుగుబాలు చింతలచెరువు, దొంతలవారి చెరువు వద్ద మొక్కలు నాటారు. జాతీయ జెండాకు వందనం, జాతీయ

విశ్రాంత ఆర్మీ ఉద్యోగులకు ఘన సత్కారం

గీతాలాపన, 1965, 1971 పాకిస్తాన్ యుద్ధంలో పాల్గొన్న విశ్రాంత ఆర్మీ ఉద్యోగి మీసాల సత్యంను సత్కరించారు.కార్యక్రమంలో ఎంపిపి మజ్జి శారదా ప్రియాంక , జెడ్‌పిటిసి కోరాడ వెంకటరావు, ఎంపిడిఒ లవరాజు, ఇన్‌ఛార్జి ఇఒపిఆర్‌డి కరుణాకరరావు, గ్రామ కార్యదర్శి శ్రీరామ్మూర్తి, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు చందక సూరిబాబు, ఉప సర్పంచ్ బంటుబిల్లి రమణమ్మ నాయకులు సినగం రామారావు, విఆర్‌పి ధనం, లొడగలవానిపాలెంలో మాజీ సర్పంచ్ లొడగల రమణ గ్రామ కార్యదర్శి అనూరాధ వార్డు సభ్యులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు

స్వీయ క్రమశిక్షణతో పనిచేయడమే దేశభక్తి

ములగాడ : దేశభక్తి అంటే దేశ సరిహద్దుల్లో కాపలా కాయడం మాత్రమే కాదని, ఎవరి విధిని వారు చిత్తశుద్ధితో, స్వీయక్రమశిక్షణతో నిర్వహించడమేనని విశ్రాంత ఆర్మీ ఉద్యోగి గుజ్జరి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం సెయింట్ ఆన్స్ కాలేజీలో కరస్పాండెంట్ సిస్టర్ గెసిల్లా అధ్యక్షతన నా మట్టి, నా దేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ, సమాజంలోని చెడును ప్రశ్నించాలని, సమాజాభివృద్ధికి అంతా కృషి చేయాలని కోరారు. కాలేజీ ఆవరణలో మొక్కలు నాటారు. దేశభక్తులను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగుతామని ప్రతిజ్ఞ చేశారు. మాజీ సైనికులు శ్రీనివాసరావును దుశ్శాలువాతో సత్కరించారు. ఎన్ఎస్ఎస్ జిల్లా ప్రోగ్రాం అధికారి ఇపి.ఎస్. భాగ్యలక్ష్మి ఇతర ప్రోగ్రాం అధికారులు వై. అనసూయాదేవి, అంజలీదేవి, ఎం నదియా, ఎ .సంధ్య రాణి పాల్గొన్నారు

పద్మనాభం: మండలంలోని అయినాడ, కోరాడ గ్రామాల్లో, బుధవారం నా భూమి నా దేశం, నేల తల్లికి నమస్కారం, వీరులకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఆయా సచివాలయ ప్రాంగణాలను అందంగా తీర్చిదిద్దగా, స్థానిక ఎంపిపి రాంబాబు ఆధ్వర్యంలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపిడిఒ విజయ్‌కుమార్, వైసిపి నేతఎం శివ రమేష్ పాల్గొన్నారు

టిడిపి మహాశక్తి ర్యాలీ

ర్యాలీలో పాల్గొన్న 26వ వార్డు తెలుగు మహిళలు

ప్రజాశక్తి-సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గంలో టిడిపి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఇన్‌ఛార్జి చిక్కాల విజయకుమార్ ఆదేశాలతో 26వ వార్డులో భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా తెలుగు మహిళలు మహాశక్తి ర్యాలీ నిర్వహించారు ఈ సందర్భంగా స్థానిక టిడిపి కార్పొరేటర్ ముక్కు శ్రావణి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టిడిపి అధికారి చేపట్టడం ఖాయమన్నారు. అవినీతిమయమైన వైసిపి రాక్షసపాలనపై ప్రజలు విసిగిపోయి ఉన్నారని, యువతకు ఉద్యోగాలు, మహిళా సాధికారిత కావాలంటే టిడిపి అధికారంలోకి రావాల్సి ఉందని, పార్టీ కేడరంతా సమిష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెలుగు మహిళ రాష్ట్ర ప్రతినిధి ఈతలపాక సుజాత , విశాఖ పార్లమెంటు అధ్యక్షురాలు అనంతలక్ష్మి, బి. లలిత , బి .పద్మలత , మాజీ కార్పొరేటర్ పి .నరసకుమారి, ఎల్. లావణ్య, ఎస్ పద్మ, ఎల్ పార్వ , ఎం దేవి, వార్డు అధ్యక్ష, కార్యదర్శులు, కన్వీనర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా డాక్టర్ రమణమూర్తి జన్మదిన వేడుకలు

డాక్టర్ రమణమూర్తిని సన్మానిస్తున్న యువజన సమాజం సభ్యులు

ప్రజాశక్తి-మాధవధార : కళా హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పైడి వెంకటరమణమూర్తి జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మాధవధార మాధవ యువజన సమాజం సభ్యులు ఘనంగా సత్కరించి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాధవ యువజన సమాజం కన్వీనర్ సనపల రామ్‌గోపాలరావు, సహాయ కన్వీనర్ పప్పల రామచంద్రరావు, మాజీ అధ్యక్షులు భగవతి శ్రీరామమూర్తి, సనపల నారాయణస్వామి, సనపల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

అంకితభావంతో ప్రజాసేవ చేయాలి

ప్రజాశక్తి- సీతమ్మధార : ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందేలా కృషి చేయడంతోపాటు, పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని దక్షిణ నియోజకవర్గ వైసిపి ముఖ్యనేత సీతంరాజు సుధాకర్ సూచించారు. బుధవారం దక్షిణ నియోజకవర్గం, 33వ వార్డు వైసిపి నేతలు పచ్చిరపల్లి రాము, పివి. నరసింహారెడ్డి, తదితరులు సీతంరాజు సుధాకర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా పార్టీ అభివృద్ధిపై మాట్లాడారు.

సజ్జలను కలిసిన వైసిపి నేతలు

సజ్జలతో 18 వార్డు వైసిపి నేతలు

ప్రజాశక్తి- విశాఖపట్నం : ప్రభుత్వ సలహాదారు, వైసిపి ముఖ్యనేత సజ్జల రామకృష్ణారెడ్డిని 18వ వార్డు వైసిపి ఇన్‌ఛార్జి పుక్కళ్ల ధనలక్ష్మి, సీనియర్ నేత శంకర్ బుధవారం తాడేపల్లిలోని సజ్జల కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు. మత్స్యకారులకు పార్టీలో అత్యంత గౌరవాన్ని కల్పిస్తూ విశాఖపట్నం వైసిపి జిల్లా అధ్యక్షులుగా మత్స్యకారులైన కోలా గురువులుకు స్థానం కల్పించడం, డిసిసిబి చైర్మన్‌గా ఆయనను నియమించడంపై ధన్యవాదాలు తెలిపారు.

అదానీ యాజమాన్యం నిర్లక్ష్య వైఖరి తగదు

సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరావు
37వ రోజుకు నిర్వాసిత కార్మికుల దీక్షలు

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరావు

ప్రజాశక్తి -గాజువాక : గంగవరం పోర్టు యాజమాన్యం కార్మికులను బానిసలుగా చేసి, వారి శ్రమను దోచుకుంటోందనిసిఐటియు జిల్లా అధ్యక్షులు కెఎం. శ్రీనివాసరావు మండిపడ్డారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అండతోనే నిర్లక్ష్యధోరణి వ్యవహరిస్తున్న యాజమాన్యం ఇప్పటికైనా కార్మిక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆదానీ గంగవరం పోర్టు నిర్వాసిత కార్మికుల నిరవధిక నిరసనలు బుధవారం 37వ రోజుకు చేరుకున్నాయి. క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో క్విట్ ఆదాని క్విట్ మోడీ, సేవ్ ఇండియా, సేవ్ వర్కర్ నినాదంతో ఆదానీ గంగవరం పోర్టు నిర్వాసిత కార్మికులు శిబిరం వద్ద నుండి పెదగంట్యాడ జంక్షన్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించి మానవహారం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ వేతనాలు పెంపు, ఇతర సమస్యలపై దీక్షలు చేస్తున్న కార్మికులతో పలుదఫాలుగా చర్చలు జరిగినా, యాజమాన్యం మొండివైఖరి వీడకపోవడం దుర్మార్గమన్నారు. శిబిరాన్ని సందర్శించిన మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య మాట్లాడుతూ పోర్టు నిర్మాణానికి సర్వం త్యాగం చేసిన నిర్వాసిత కార్మికుల పట్ల యాజమాన్యం వైఖరి ఎంతమాత్రం సహేతుకం కాదన్నారు. కార్మికుల వేతన పెంపు, ఇతర సమస్యల పరిష్కారంపై స్పష్టతనివ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం పోర్టు యాజమాన్య హెచ్ఆర్ మేనేజ్‌మెంట్ సి ఎస్ రాజుతో కూడిన బృందం శిబిరం వద్దకు వచ్చి కార్మికులతో మాట్లాడారు. వైవి సుబ్బారెడ్డి, జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగిన చర్చలకు యాజమాన్యం కట్టుబడి ఉందని, ముందుగా కార్మికులు విధుల్లో చేరాలని, తర్వాత వేతన పెంపుపై చర్చిద్దామని ఆహ్వానించారు. అలాకాకుండా . ఉద్యోగాల నుండి తొలగించిన వారిని ఎప్పటిలోగా విధుల్లోకి తీసుకుంటారో, వేతన పెంపు ఎంత ఉంటుందో ముందుగా స్పష్టత నివ్వాలని యూనియన్ ప్రధాని కార్యదర్శి లొల్లి తాతారావు కోరారు. స్పష్టత లేకుండా విధులకు హాజరయ్యేది లేదని తేల్చి చెప్పారు. కార్యక్రమంలో సిఐటియు స్టీల్ జోన్ ప్రధాన కార్యదర్శి కొవిరి అప్పలరాజు, యూనియన్ నాయకులు వాసుపల్లి ఎల్లాజీ, గంటిపిల్లి అమ్మోరు, మాది అప్పారావు, పేర్ల నూకరాజు, కదిరి సత్యానందం, నొల్లి స్వామి, కొవిరి అమ్మోరు పాల్గొన్నారు..

సురక్షిత భవనంలోకి విద్యార్థులను తరలించండి

హాస్టల్ విద్యార్థులతో మాట్లాడుతున్న సిఐటియు నేతలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : శిథిల భవనంలో ఉంటున్న ప్రభుత్వ ఎస్‌సి బాలుర కళాశాల విద్యార్థులను వెంటనే సురక్షిత భవనంలోకి తరలించాలని సిఐటియు భీమిలి జోన్ అధ్యక్షులు ఆర్ఎస్ఎన్ మూర్తి, కార్యదర్శి రవ్వ నరసింగరావు డిమాండ్ చేశారు. బుధవారం శిథిలావస్థలో ఉన్న హాస్టల్ భవనాన్ని సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి, వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. శిథిల భవనంలో విద్యార్థులు ఉంటుండడం వల్ల ఏ క్షణంలో ఎటువంటి ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి ఉందని, వెంటనే వారిని వేరే భవనంలోకి తరలించాలని డిమాండ్ చేశారు. శిథిలావస్థకు చేరిన హాస్టల్ భవనాన్ని పునర్నిర్మించాలని కోరారు.

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

సిటీ బస్‌లో ప్రయాణించిన టిడిపి నేత శ్రీభరత్

ఆర్‌టిసి ఆర్డినరీ సిటీ బస్‌లో ప్రయాణికులతో శ్రీభరత్

ప్రజాశక్తి- మధురవాడ : బస్‌స్టాప్‌ల ఆధునికీకరించే సమయంలో నగరంలోని సిటీబస్ ప్రయాణికులకు అవసరమైన మెరుగైన సౌకర్యాలపై నగరపాలక సంస్థ దృష్టి సారించాలని విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ తెలుగుదేశం ఇన్‌ఛార్జి ఎం.శ్రీభరత్ సూచించారు. డైలాగ్ విత్ భరత్, వార్డుల్లో పాదయాత్ర, ప్రజలతో ముఖాముఖి వంటి కార్యక్రమాల ద్వారా దూకుడు పెంచిన యువనేత బుధవారం నగరంలోని సిటీ బస్‌కాంప్లెక్స్ నుంచి భీమిలి వెళ్లే ఆర్‌టిసి బస్‌లో ప్రయాణించారు. ఈ సందర్భంగా ప్రజల అవసరాలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్య కూడళ్లలో నిర్మించే బస్‌స్టాప్ వద్ద మరుగుదొడ్ల సౌకర్యాన్ని కల్పించాలని కొందరు ప్రయాణికులు శ్రీభరత్‌ను కోరారు. అలాగే సీనియర్ సిటిజన్లకు ప్రత్యేక సౌకర్యం కావాలని కొందరు సూచించారని తెలిపారు. రుషికొండ కూడలి వరకు సాధారణ ప్రయాణికులతో పాటు ప్రయాణించిన శ్రీభరత్, బస్ దిగిన అనంతరం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ప్రస్తుత బస్‌ఛార్జీలు అధికంగా ఉన్నాయని, అందుకే ఎసి బస్ సదుపాయం కల్పించినా వినియోగించుకునేందుకు ప్రయాణికులు ఆసక్తి కనబరచలేదన్నారు. నిత్యం అధిక దూరం ప్రయాణించే బస్‌పాస్ ప్రయాణికుల అభిప్రాయాలను ప్రభుత్వం పరిశీలించాలని సూచించారు. వివిధ వర్గాల ప్రజలను కలవడం, వారి ఆలోచనలను తెలుసుకోవాలన్న ఆసక్తితోనే తాను సిటీ బస్‌లో ప్రయాణించినట్లు తెలిపారు.

చినగదిలి హెచ్ఎం సస్పెన్షన్

విద్యార్థుల నోటు పుస్తకాలను తనిఖీ చేస్తున్న డిఇఒ చంద్రకళ

ప్రజాశక్తి - ఆరిలోవ : పాఠశాల, విధులు నిర్వహణలో బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన చినగదిలి హెచ్ఎం సూర్యనారాయణను జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ సస్పెండ్ చేశారు. బుధవారం చినగదిలి మండల ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఆ సమయంలో ప్రధానోపాధ్యాయులు లేకపోవడం, ఒక వాలంటీర్‌ని నియమించి బోధన చేయడాన్ని పరిశీలించి, అసంతృప్తిని వ్యక్తం చేసారు. విద్యార్థుల వర్క్ బుక్స్‌ను సరిగా దిద్దకపోవడాన్ని గమనించారు. బాధ్యులైన ప్రధానోపాధ్యాయుడు సూర్యనారాయణను అక్కడికక్కడే సస్పెండ్ చేసారు. అంతకుముందు పెదవాల్తేరులోని జివిఎంసి ప్రాథమిక పాఠశాలలను కూడాఆకస్మికంగా తనిఖీ చేసారు. పాఠశాలల నిర్వహణ, సిబిఎ-1 పరీక్ష పేపరును, సిలబస్ కంప్లీషన్, పిల్లల వర్క్‌బుక్స్‌ను పరిశీలించారు. జగనన్న గోరుముద్దను ప్రత్యక్షంగా పరిశీలించి రుచి చూసారు.

49వ వార్డులో గడపగడపకూ...

వార్డులో పర్యటిస్తున్న కెకె.రాజు, వైసిపి నేతలు

ప్రజాశక్తి- సీతమ్మధార : జివిఎంసి 49వ వార్డు ఎన్‌జివోస్ కాలనీ-2, బర్మా క్వార్టర్స్, నెహ్రూ నగర్ కాలనీ ప్రాంతాల్లో బుధవారం విశాఖ ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త, రాష్ట్ర నెడ్ క్యాప్ చైర్మన్ కెకె రాజు స్థానిక కార్పొరేటర్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు గడపగడపకు ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ ఫలాలను వివరిస్తూ, ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కె.కె రాజు మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి పరిపాలనలో ప్రజలందరూ సంతోషంగా ఉన్నారన్నారు. చంద్రబాబు అండ్ కంపెనీని ఎవరూ నమ్మడం లేదన్నారు. కార్యక్రమంలో బోగవల్లి గోవింద్, కె.చిన్నా, యం.సునీల్, వెంకటేష్ గురువోజీ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్

ప్రజాశక్తి-సీతమ్మధార :ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా విశాఖ ఉత్తర నియోజకవర్గ వైసిపి కార్యాలయంలో సమన్వయకర్త, నెడ్‌క్యాప్ రాష్ట్ర చైర్మన్ కెకె.రాజు బుధవారం గ్రీవెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులను స్వయంగా స్వీకరించారు. పలు సమస్యలకు వెంటనే ఫోనులో సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించారు.మిగతా సమస్యలకు సంబంధించిన వినతులు, స్వీకరించి, సంబంధిత అధికారులకు రిఫర్ చేసి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

ఆదివాసీ హక్కుల దినోత్సవంగా మార్చాలి

కాంగ్రెస్ ఒబిసి విభాగం రాష్ట్ర చైర్మన్ వెంకటరావు

అరకులో ఆదివాసీ దినోత్సవ వేడుకలో పాల్గొన్న వెంకటరావు

ప్రజాశక్తి- మాధవధార : ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఆదివాసీ హక్కుల దినోత్సవంగా మార్చాలని కాంగ్రెస్ ఒబిసి విభాగం రాష్ట్ర చైర్మన్ మూల వెంకటరావు కోరారు. బుధవారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవ సందర్భంగా మాట్లాడుతూ, అరకులో ఆదివాసీ దినోత్సవ సంబరాలను కాంగ్రెస్ ఆధ్వర్యాన నిర్వహించామన్నారు. దేశంలో పదికోట్ల పైచిలుకు ఆదివాసీలుంటే, 700 ఆదివాసీ 75 ఆదిమజాతి తెగల హక్కులను గుర్తించేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిరాకరిస్తోందన్నారు. స్వతంత్రం ముందే గిరిజనులు బ్రిటిష్ వారితో పోరాడి నివాస ప్రాంతాలపై అడవిపై ప్రత్యేక హక్కులు సాధించుకున్నారని స్వాతంత్రం అనంతరం భారత రాజ్యాంగం కూడా వారి ఆచార సాంప్రదాయాన్ని పాటించే స్వేచ్ఛనిచ్చిందన్నారు. . ఆదివాసుల అభివృద్ధి సంక్షేమం కోసం దేశ తొలి ప్రధాని జవహర్లాల్ నెహ్రూ ట్రైబల్ పంచశీల అనే పాలసీని తీసుకొచ్చి, 5 అంశాలను పొందుపరిచారన్నారు. ఆదివాసీలు తిండికోసం వలస పోయే పరిస్థితులున్నాయని, విద్యా వైద్యం, తాగునీరు, రహదారులు వంటి సదుపాయాలు లేక నేటికీ దుర్భర జీవితాన్ని అనుభవిస్తున్నారన్నారు. అడవులపై వారు సాధించుకున్న హక్కులను తొలగించి కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టాలని చూస్తున్న నేపథ్యంలో వాటి పరిరక్షణకు ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఆదివాసీ హక్కుల దినోత్సవంగా మార్చాలని డిమాండ్ చేశారు.

ఆదివాసీల సంస్కృతిని గౌరవించాలి

జిల్లా కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి

ప్రజాశక్తి-అనకాపల్లి

ఆదివాసీల సంస్కృతి సాంప్రదాయాలను అందరూ గౌరవించాలని జిల్లా కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి పిలుపునిచ్చారు. పట్టణంలోని గుండాల సచివాలయ సమావేశ మందిరంలో బుధవారం ఏర్పాటు చేసిన ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం అల్లూరి సీతారామరాజు, బిర్సాముండా, గాం గంటం దొర, గాం మల్లు దొర చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచంలోనే ఆదివాసీల సంస్కృతి విభిన్నంగా ఉంటుందని, ప్రకృతి ఆరాధనతో ముడిపడి ఉంటుందని చెప్పారు. భారతీయ మూలాలు సజీవంగా ఉన్నాయంటే ఆదివాసుల వల్లనేనని గుర్తించి వాటిని అవగాహన చేసుకుని ప్రచారం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ గిరిజన బాలికలతో కలిసి ప్రదర్శించిన థింసా, ఇతర నృత్యాలు అందరిని ఆకర్షించాయి. ఈ కార్యక్రమంలో జెడ్‌పి ఉపాధ్యక్షురాలు బి.వరాహ సత్యవతి, బీసీ వెల్ఫేర్ డిడి రాజేశ్వరి, గిరిజన సంక్షేమ శాఖ అధికారి నాగ శిరీష, బుచ్చయ్యపేట జెడ్‌పిటిసి దొండా రాంబాబు, తుమ్మపాల సర్పంచ్ పెంటయ్య నాయుడు, జిల్లాలోని గిరిజన సంక్షేమ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా ఆదివాసీ దినోత్సవం

భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ డైట్‌లో బుధవారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డైట్ ప్రిన్సిపల్ ఎల్ సుధాకర్ మాట్లాడుతూ, ప్రకృతితో పెనవేసుకున్న పర్యావరణ హిత సంప్రదాయాలు ఆదివాసీ జీవనశైలిలో అంతర్భాగాలని అన్నారు. ఆదివాసీలు తమ ప్రత్యేక సంస్కృతితో పాటు అటవీ భూములు, సహజ వనరులు, పర్యావరణాన్ని కాపాడడంలో కీలక భూమిక పోషిస్తున్నారన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఎం మహాలక్ష్మి సోమయాజులు, జె మాధవి పాల్గొన్నారు.

నిరసన తెలియజేస్తున్న గిరిజనులు

షెడ్యూల్ ఏరియాలో చేర్చాలని నిరసన

ప్రజాశక్తి-మాడుగుల : ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం పిలుపు మేరకు బుధవారం మండలంలోని రావిపాలెం గ్రామంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం 5వ షెడ్యూల్ సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహమూర్తి మాట్లాడుతూ, మైదాన గిరి గ్రామాలను షెడ్యూల్ ఏరియాలో చేర్చాలని డిమాండ్ చేశారు. కేంద్రం తీసుకువచ్చిన నూతన అటవీ పాలసీని రద్దు చేయాలని, బోయ/వాల్మీలను ఎస్టీ జాబితాలో చేర్చవద్దని కోరారు. ఆదివాసీల హక్కుల కోసం గిరిజనులంతా కలిసి కట్టుగా పోరాటం చేయాలన్నారు. చిన దేముడు, మారయ్య, పోతురాజు, ఈశ్వరరావు, వెంకట్, ఈశ్వరమ్మ పాల్గొన్నారు

సమావేశంలో పాల్గొన్న ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ నాయకులు

సమిష్టిగా పని చేద్దాం

ప్రజాశక్తి-కె.కోటపాడు : రాష్ట్రంలో ప్రైవేట్ విద్యా సంస్థలు సంఘాలు పరంగా వేర్వేరుగా ఉన్నా, సమయం వచ్చినప్పుడు సమిష్టిగా సమైక్యంగా పనిచేద్దామని ఏపి ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (అపుస్మా) రాష్ట్ర కన్వీనర్ బి.గంగయ్య అన్నారు. బుధవారం స్థానిక అయ్యన్న విద్యా సంస్థలలో 'అపుస్మా' రాష్ట్ర ఐటీ విభాగం చీఫ్ కో-ఆర్డినేటర్ డాక్టరు ఖాశీం ఆధ్వర్యంలో అపుస్మాతోపాటు విశాఖ రీజియన్ అన్ ఎయిడెడ్ రికగ్నైజ్డ్ స్కూల్స్ అసోసియేషన్ (వుర్సా) ప్రతినిధులతో గంగయ్య మాట్లాడారు. ఒకప్పుడు ప్రైవేట్ విద్యాసంస్థలపై ఉన్నత అధికారులకు దురభిప్రాయం ఉండేదని, సంఘాలుగా ఏర్పడి నేడు ప్రైవేట్ విద్యా సంస్థలకు చెందిన ముగ్గురు కరెస్పాండెంట్స్ ఎమ్మెల్సీలుగా ప్రాతినిధ్యం వహించే స్థాయికి మనం ఎదిగామని చెప్పారు. ఈ నేపథ్యంలో ప్రైవేట్ విద్యా సంస్థల న్యాయపరమైన డిమాండ్స్ సాధనకు సంఘాలన్నీ సంఘటితంగా పోరాడుదామని చెప్పారు. అపుస్మా రాష్ట్ర కోశాధికారి ఎంవిరావు మాట్లాడుతూ మూడేళ్ల నుంచి ఎనిమిదేళ్లకు పెంచిన ప్రైవేట్ స్కూళ్ల గుర్తింపు కాలపరిమితి జీఓ కొన్ని జిల్లాల్లో అమలు కావడం లేదన్నారు. కార్యక్రమంలో అపుస్మా విశాఖ, అనకాపల్లి జిల్లా అధ్యక్షులు డాక్టరు సుంకర శ్రీనివాసరావు, నల్లపురెడ్డి సీతారామరాజు, వుర్సా జిల్లా కార్యదర్శి కె.ప్రకాష్, ఎం.విజయ్ కుమార్, బి.వేణు పాల్గొన్నారు.

ముగిసిన సైబర్ సెక్యూరిటీ వర్క్‌షాప్

ప్రజాశక్తి- అనకాపల్లి : స్థానిక దాడి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో కంప్యూటర్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు విద్యార్థులకు జరిగిన సైబర్ సెక్యూరిటీ వర్క్‌షాప్ బుధవారం ముగిసింది. ఈ వర్క్‌షాప్‌లో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్ వైకుంఠరావు మాట్లాడుతూ సైబర్ సెక్యూరిటీ కోర్సు నేర్చుకోవటం వలన కలిగే ఉపయోగాలను వివరించారు. కళాశాల ఛైర్మన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ భవిష్యత్తులో ఈ కోర్స్ వలన మంచి ఉద్యోగాలు సంపాదించడానికి ఉపయోగపడతాయని తెలిపారు. సిఎస్‌ఈ విభాగాధిపతి డాక్టర్ సుజాతపాల్గొన్నారు.

ఎంవిఆర్ పిఎగా సతీష్ కుమార్

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రజా సేవను మరింత విస్తృత పరిచే చర్యలలో భాగంగా ప్రముఖ వ్యాపారవేత్త ముత్యాల వెంకటేశ్వరరావు (ఎంవిఆర్) బుధవారం తన కార్యాలయంలో సిబ్బంది, ముఖ్య అనుచరులతో ఇష్టాగోష్టి నిర్వహించారు. ఈ మేరకు తన వ్యక్తిగత సహాయకుడిగా నియమించబడిన కె.సతీష్ కుమార్‌ను అక్కడ ఉన్న వారందరికీ పరిచయం చేశారు. కార్యాలయ పిఆర్‌ఓగా సేవలు అందిస్తున్న అవతారం (అవ్వ)నే కొనసాగిస్తున్నట్లు ఎంవిఆర్ పేర్కొన్నారు. వీరిరువురికి ట్రస్ట్ కార్యకలాపాలపై నిర్వర్తించాల్సిన విధులపై ఆయన సూచనలు ఇచ్చారు. విజయనగరం జిల్లాలోని శ్రీరామ్ చిట్స్‌లో గత 20 సంవత్సరాలుగా సేవలందించి పదవీ విరమణ తర్వాత ఎంవిఆర్ మీద మక్కువతో ఆయన వద్ద సహాయకుడిగా ఉండేందుకు వచ్చానని సతీష్ కుమార్ వెల్లడించారు. ఈ సందర్భంగా ఎంవిఆర్‌ను సతీష్ కుమార్ పుష్పగుచ్ఛంతో అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంవిఆర్ చారిటబుల్ ట్రస్ట్ సిబ్బంది, అభిమానులు పాల్గొన్నారు.

డిసిఎంఎస్‌కు పూర్వ వైభవం తీసుకొస్తాం

ప్రజాశక్తి- అనకాపల్లి : జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ కి (డీసీఎంఎస్) పూర్వవైభవం తీసుకొస్తామని డీసీఎంఎస్ ఛైర్మన్ పల్లా నర్సింగరావు పేర్కొన్నారు. స్థానిక డిసిఎంఎస్ ఆవరణలో బుధవారం చోడవరం శాసనసభ్యులు కరణం ధర్మశ్రీ సమక్షంలో నర్సింగరావు సంస్థ ఛైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా నర్సింగరావు మాట్లాడుతూ అనకాపల్లి డిసిఎంఎస్‌కు ఘన చరిత్ర ఉందన్నారు. మంత్రి అమర్నాథ్, పార్లమెంట్ సభ్యురాలు సత్యవతి, చోడవరం శాసనసభ్యులు కరణం ధర్మశ్రీ సంస్థ అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. విలువైన ఆస్తులు ఉన్న డీసీఎంఎస్ ఆవరణలో గతంలో ప్రతిపాదించిన పెట్రోల్ బంక్, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి సహకరించాలని కోరారు. చోడవరం శాసనసభ్యుడు ధర్మశ్రీ మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో డీసీఎంఎస్ నిర్వీర్యమైందన్నారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్, నాయకులు డాక్టర్ విష్ణుమూర్తి డీసీఎంఎస్ డైరెక్టర్ పిల్లా దామోదర నర్సింగరావు (గాంధీ), బొండా రాంబాబు, సేనాపతి సత్యారావు ఏడువాక సత్యారావు, కరక సోమునాయుడు పాల్గొన్నారు.

మంత్రి చేసిన అభివృద్ధి తెలియజేయాలి

ప్రజాశక్తి- అనకాపల్లి : రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రిగా గుడివాడ అమర్నాథ్ తన శాఖ ద్వారా నియోజకవర్గానికి చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని జనసేన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పరుచూరి భాస్కరరావు కోరారు. స్థానిక బైపాస్ రోడ్ లోని జనసేన పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పవన్ కళ్యాణ్ ఈనెల 10 నుంచి 19వ తేదీ వరకు విశాఖపట్నంలో జనవాణి సమావేశాలు ఉంటాయన్నారు. జాతీయ మీడియాలో వైసిపి భూ అక్రమాలు, మంత్రి అమరనాథరెడ్డి విస్సన్నపేట భూ బాగోతంపై సందర్శన ఉంటాయన్నారు. మెగాస్టార్ చిరంజీవి పై అమర్, బొత్స, కొడాలి నాని, పేర్ని నాని అనుచిత వ్యాఖ్యలు తగవన్నారు. ఇప్పటికైనా తమ నాయకుడు పవన్ కళ్యాణ్‌పై అవాకులు చవాకులు మాట్లాడడం మానుకోవాలని హితవు పలికారు.

మెడికల్ విద్య జిఒలపై ఎస్ఎఫ్ఐ నిరసన

రద్దు చేయాలని డిమాండ్

నిరసన తెలుపుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి-అనకాపల్లి

రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ సీట్ల విషయంలో తీసుకొచ్చిన జీవోలను, ఎస్సీ ఎస్టీ బీసీ విద్యార్థులకు మెడికల్ విద్యకు దూరం అయ్యేవిధంగా తీసుకొచ్చిన జీవోలను రద్దు చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక ఏఎంఏఎల్ కళాశాల గేటు ముందు బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్ రమణ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మెడికల్ కళాశాల పెరుగుతున్న తరుణంలో అదనంగా పేద విద్యార్థులకు మెడికల్ సీట్లు పెంచాల్సిన పరిస్థితి ఉన్నప్పటికీ మేనేజ్మెంట్ కోటాను 50శాతం చేసి, పేద విద్యార్థులకు మెడికల్ విద్యను దూరం చేసే విధంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. ఈ వ్యవహార శైలిని మార్చుకోవాలని గతం లాగే మెడికల్ విద్యను అందించాలని రిజర్వేషన్ కోటనుఅమలు చేయాలని కోరారు. ప్రస్తుతం తీసుకొని వచ్చిన జీవో నెంబర్ 107, 108 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా ఎస్ఎఫ్ఐ ప్రెసిడెంట్ మామిడి రమణ కోశాధికారి గొర్లి తరుణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

12న మహా ధర్నాను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 12న ఫ్యాప్టో ఆధ్వర్యంలో నిర్వహించే మహా ధర్నాను విజయవంతం చేయాలని ఫ్యాప్టో ఛైర్మన్ గొంది చిన్నబ్బాయి పిలుపునిచ్చారు. అనకాపల్లి సిఐటియు ఆఫీసులో బుధవారం జరిగిన ఫ్యాప్టో జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ఏర్పడి నాలుగు సంవత్సరాలు గడుస్తున్నా ప్రధాన సమస్యలు పరిష్కారం కాలేదని వాపోయారు. సిపిఎస్ రద్దు విషయంలో ముఖ్యమంత్రి జగన్ మాట తప్పారని విమర్శించారు. ముఖ్యమంత్రి తాను చేసిన వాగ్దానం నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తెచ్చిన జిఓ 117 వలన ప్రాథమిక పాఠశాలలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. ఫలితంగా ప్రాథమిక పాఠశాలలు మూతపడే పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో

మాట్లాడుతున్న ఫ్యాప్టో జిల్లా ఛైర్మన్ చిన్నబ్బాయి

ఉపాధ్యాయులపై వేధింపులు ఎక్కువయ్యాయని వాపోయారు. ఈ సమావేశంలో సెక్రటరీ జనరల్ వై.సుధాకర్ రావు డిప్యూటీ సెక్రటరీ జనరల్లు ఎన్. సన్యాసి నాయుడు (ఏపీటీఎఫ్ - 257), రవీంద్రబాబు (హెచ్ఎం అసోసియేషన్) సిహెచ్.నాగేశ్వరరావు (ఏపీటీఎఫ్), కార్యవర్గ సభ్యులు ప్రేమ్ కుమార్ (ఎస్‌టియు), వత్సవాయి శ్రీలక్ష్మి (యుటిఎఫ్), ఎం. శ్రీనివాసరావు (ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం) తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల పోరాటానికి సిఐటియు మద్దతు

ప్రజాశక్తి -అనకాపల్లి : రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ కార్మికులు చేస్తున్న ఆందోళనకు సిఐటియు అనకాపల్లి జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని సిఐటియు జిల్లా అధ్యక్ష ఉపాధ్యక్షులు ఆర్ శంకర్రావు, గని శెట్టి సత్యనారాయణ పేర్కొన్నారు. స్థానిక విలేకరులతో బుధవారం మాట్లాడుతూ ప్రజలకు నిరంతరం విద్యుత్ వెలుగులు నింపుతూ ప్రాణాలను పణంగా పెట్టి పనిచేస్తున్న విద్యుత్ కార్మికుల సమస్యల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉందన్నారు. గత నాలుగు సంవత్సరాలుగా పిఆర్సి అమలు కాక పెరుగుతున్న ధరలతో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కాంట్రాక్ట్ షిఫ్ట్ ఆపరేటర్లు లైన్మెన్లు ఆఫీస్ సిబ్బంది పర్మినెంట్ కాక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

రద్దు చేసిన రైళ్లను పునరుద్ధరించాలని వినతి

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి జిల్లా కేంద్రమైన తరువాత ప్రయాణ రాకపోకలు పెరిగాయని, అందువల్ల అన్ని రైళ్లకు అనకాపల్లి రైల్వే స్టేషన్‌లో హాల్ట్ కల్పించాలని స్టేషన్ మేనేజర్‌కు డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ నాయకులు సిహెచ్ శివాజీ మాట్లాడుతూ గతంలో రద్దు చేసిన కాకినాడ-విశాఖపట్నం, రాజమండ్రి-విశాఖపట్నం రైళ్లను పునరుద్ధరించాలని కోరారు. ఈ రైళ్లను రద్దుచేసి నెలలు గడుస్తున్నా ఇంతవరకు పునరుద్ధరించలేదన్నారు. అనువైన సమయాల్లో నడిచే ఈ రైళ్లను నిలిపివేయడం వల్ల ప్రయాణికులు అనేక ఇబ్బందులుపడుతున్నారని పేర్కొన్నారు. విద్యార్థులు, ఉద్యోగులు, చిరు వ్యాపారులకు అత్యంత ఉపయోగకరంగా వున్న రైళ్లను పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు చింతకాయల శివాజీ, ఉపాధ్యక్షులు అల్లు రాజు, జిల్లా కమిటీ సభ్యులు ఎస్.నాగరమణ, ఎం.రమణ పాల్గొన్నారు.

పాఠశాలలను సందర్శించిన ఆర్‌జెడి

ప్రజాశక్తి-చోడవరం : మండలంలో జుత్తాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గజపతినగరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, చోడవరం జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలను, ఎంఇఒ కార్యాలయాన్ని విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ యమ్.జ్యోతి కుమారి బుధవారం సందర్శించారు. జుత్తాడ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల వర్క్ బుక్స్‌ను పరిశీలించారు. అనంతరం చిన్నారి డాక్టర్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. గజపతినగరం ప్రాథశాలలో బుక్స్‌లో కరెక్షన్స్ పరిశీలించారు. చోడవరం బాలికోన్నత పాఠశాలలో 9వ తరగతి విద్యార్థుల ఫార్మేటివ్-1 పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినులను అభినందించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. అనంతరం ఉపాధ్యాయులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. విధులు పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు జయలక్ష్మి, సింహాచలం, ఆర్‌జెడి సహాయకులు డి.శ్రీను, హెచ్ఎంలు వివి.శేషగిరి, ఐ.రామిరెడ్డి, సిఆర్‌పికెవియమ్. నాయుడు, పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న పెందుర్తి ఎమ్మెల్యే అదీప్ రాజ్

సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-సబ్బవరం : మండల కేంద్రంలోని సాయినగర్‌లో 40లక్షలతో నిర్మించనున్న సిసి రోడ్డు నిర్మాణానికి బుధవారం పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్బవరం అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనకపల్లి- లంకెల పాలెం రోడ్డు పనులు త్వరలో చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి రాము నాయుడు, జెడ్పి వైస్ ఛైర్మన్ తుంపాల అప్పారావు, వైసీపీ నేతలు కోటాన రాము, సబ్బవరపు ముత్యాల నాయుడు,కర్రి బాబు, దనిమిరెడ్డి శ్రీనివాసరావు, పల్లా కష్ట, డి పద్మావతి, టి. శేఖర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న హెరిటేజ్ మేనేజర్ శేషు

హెరిటేజ్ పాలసేకరణ కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-కశింకోట : కశింకోట మండలం జోగారావుపేట గ్రామంలో హెరిటేజ్ డెయిరీ నూతన పాల సేకరణ కేంద్రాన్ని డెయిరీ మేనేజర్ కూండ్రపు శేషు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డెయిరీకి పాలు పోసిన రైతుల పాడి పశువులకు కృత్రిమ గర్భధారణ రూ.50కు, ఆడపెయ్య పుట్టుటకు రూ.500కు కృత్రిమ గర్భధారణ చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కే. నాగ చిరంజీవి, ఎమ్. రామ అప్పారావు, ఏ గంగా శ్రీనివాసరావు, ఏ పాపి నాయుడు, బి.అప్పారావు, కే. రామలక్ష్మి రైతులు పాల్గొన్నారు.

నూకాంబిక ఆలయానికి నిధులు మంజూరుకు వినతి

ప్రజాశక్తి-అనకాపల్లి : బొజ్జన్న కొండ అభివృద్ధి కొరకు 7 కోట్ల 32 లక్షల నిధులు మంజూరు చేసినందుకు గాను కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్ రెడ్డిని అనకాపల్లి పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ బివి సత్యవతి ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాని అందజేసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె అనకాపల్లి ఇలవేల్పు శ్రీ నూకాంబిక అమ్మవారి దేవాలయ అభివృద్ధి కొరకు ప్రసాద్ పథకం కింద నిధులు విడుదల చేసి కోరారు. కళాకారులకు పుట్టినిల్లు అయిన అనకాపల్లిలో కేంద్ర నిధులతో ఒక సాంస్కృతిక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.

పోషకాహారంతోనే గర్భిణులకు ఆరోగ్యం

ప్రజాశక్తి-దేవరాపల్లి : ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష యోజన కార్యక్రమంలో భాగంగా దేవరాపల్లి పీహెచ్సీ పరిధిలో ఉన్న గర్భిణీలకు బుధవారం వైద్య సేవలు అందించారు. అనంతరం పీహెచ్సీ వైద్యాధికారిణి తీసుకోవలసిన జాగ్రత్తలను తెలియజేశారు. పోషకాహారం తోటే మెరుగైన ఆరోగ్యం పొందటంతో పాటు, శిశువుకు మంచి పోషకాలు లభిస్తాయని చెప్పారు. గర్భిణీల్లో హైరిస్క్ కేసులను గుర్తించి, వారిని మెరుగైన వైద్యం కోసం కే. కోటపాడు హాస్పిటల్‌కు తరలించినట్లు ఆమె తెలిపారు.

గర్భిణులకు పరీక్షలు చేస్తున్న డాక్టర్ వైద్యాధికారి

సినాప్టిక్స్‌లో రిసీవర్ పేలి నైట్రిక్ యాసిడ్ లీక్

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు శంకరరావు

ప్రజాశక్తి -రాంబిల్లి
మండలం ఇండస్ట్రియల్ పార్క్ సినాప్టిక్స్ ల్యాబ్ ప్రైవేట్ లిమిటెడ్‌లో బుధవారం మధ్యాహ్నం 1.30 గంటలకు రిసీవర్ బరస్ట్ అయి నైట్రిక్ యాసిడ్ లీక్ అయింది. కార్మికుల భోజన విరామ సమయంలో ఈ ప్రమాదం జరగడంతో కార్మికులకు ప్రమాదం తప్పింది. కంపెనీ వద్దకు వచ్చిన అధికారులు జిల్లా హెల్త్ ఇన్‌స్పెక్టర్ బాలాజీ కార్మికులకు ఎటువంటి ప్రమాదం జరగలేదని సమాచారం ఇచ్చారు. అలాగే ఈ ఘటనా స్థలానికి సిఐ గఫూర్ వచ్చి పర్యవేక్షించారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నా పరిశ్రమల తనిఖీ విభాగం నిద్రమత్తులో ఉంది. రాష్ట్ర పరిశ్రమల మంత్రి సొంత జిల్లాలోని పరిశ్రమలలో ప్రమాదాల అరికట్టడానికి ఎటువంటి చర్యలు చేపట్టడం లేదని. పరిశ్రమల సేఫ్టీ అధికారులు తనిఖీ లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని సిఐటియు జిల్లా అధ్యక్షులు రత్నల శంకర్రావు, అచ్యుతాపురం మండల కన్వీనర్ కె.సోమునాయుడు, రాంబిల్లి మండల కార్యదర్శి జి.దేముడునాయుడు తెలిపారు. ప్రమాదాలు జరుగుతున్నప్పుడే హడావిడిగా రావడం, తరువాత మర్చిపోవడం చేస్తున్నారన్నారు. పరిశ్రమలో ప్రమాదాలు జరగకుండా తగు చర్యలు రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాలని, సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలని డిమాండ్ చేశారు.

చేపల చెరువు వేలం పాటపై ఘర్షణ

-పలువురికి గాయాలు
-పోలీసులకు ఫిర్యాదు చేసిన టిడిపి, వైసిపి

గాయపడిన వారికి కట్లు కట్టిన దృశ్యం

ప్రజాశక్తి-చోడవరం
చేపల చెరువు వేలంపాట విషయమై మండలంలోని చర్లపాలెం గ్రామంలో బుధవారం ఘర్షణ చోటుచేసుకుంది. దీంతో టిడిపికి చెందిన ఐదుగురికి గాయాలు కాగా, వైసిపికి చెందిన మరో ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. ఇరు పార్టీల వారు ఫిర్యాదు మేరకు చోడవరం పోలీసులు కేసులు నమోదు చేశారు. టిడిపి వర్గానికి చెందిన ఐదుగురుకు బలమైన గాయాలు తగలడంతో వారిని చికిత్స నిమిత్తం ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించినట్లు స్థానిక సిఐ శ్రీనివాసరావు తెలిపారు. సిఐ కథనం ప్రకారం... చర్లపాలెం గ్రామంలో చేపల చెరువు వేలంపాట నిర్వహించడానికి వైసిపికి చెందిన స్థానిక సర్పంచ్ బూరె మాణిక్యం సమావేశం ఏర్పాటు చేయగా టిడిపికి చెందిన మాజీ సర్పంచ్ బూరె కనకమాణిక్యం సమావేశం ఈరోజు వద్దని చెప్పడంతో వివాదం చోటుచేసుకుంది. దీంతో మాట మాట పెరగడంతో నానుబిల్లి నాగరాజు ఇంటి వద్దనున్న వంట చెరుకు కట్టెలతో దాడి చేయడంతో టిడిపికి చెందిన బూరె కనక నరసింహం, బూరె వాసు, బూరె రామానాయుడు, మైచర్ల రాము అనే వ్యక్తులు గాయపడ్డారు. వీరిని చోడవరం ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. గ్రామానికి చెందిన సర్పంచ్ బూరె మాణిక్యం, నానుపల్లి నాగరాజు, మైచర్ల మహలక్ష్మి, బూరె శంకర్రావు, బూరె సత్యం, బూరె అప్పారావు తమపై దాడి చేసినట్లు బాధితులు ఫిర్యాదులు పేర్కొన్నారు. దీంతో తమకు గాయాలయ్యాయని వైసిపికి చెందినవారు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సిఐ శ్రీనివాసరావు తెలిపారు. దర్యాప్తు జరిపి ఎమ్మెల్సీ రిపోర్టులు ఆధారంగా కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

రెండు వార్డులకు మూడు నామినేషన్లు

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని పంచాయితీలో ఉప ఎన్నికల సందడి మొదలైంది. ఈనెల 8 నుంచి నామినేషన్లు ప్రక్రియ ప్రారంభం కాగా, రెండో రోజు బుధవారం ఎన్. గజపతినగరం మూడవ వార్డు నుంచి ఆదిరెడ్డి సన్యాసమ్మ ఒక్క నామినేషన్, నాగయ్యపేట పంచాయితీలో 7వ వార్డు నుంచి సింగంపల్లి సత్యవతి, ఆదిరెడ్డి లక్ష్మి నామినేషన్లు వచ్చినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి పి.వి.వి.వి.ఎస్. ప్రసాద్ తెలిపారు. ఈ నామినేషన్ల ప్రక్రియకు గురువారం సాయంత్రం ఐదు గంటలకు గడువు ముగియనున్నట్లు ఆయన తెలిపారు.

బంగారు ఆభరణాలకు హాల్ మార్క్, హెచ్‌యుఐడి తప్పనిసరి

ప్రజాశక్తి- అనకాపల్లి : బంగారు నగల దుకాణాల్లో విక్రయించే ఆభరణాలకు హాల్‌మార్క్, హెచ్‌యుఐడి (యూనిక్ ఐడెంటిఫికేషన్ నంబర్) తప్పనిసరిగా ఉండాలని రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్య అధ్యక్షుడు కాండ్రేగుల వెంకటరమణ పేర్కొన్నారు. భారత వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో ఏపీటీఎఫ్ కోలపర్తి అప్పారావు ఉపాధ్యాయ భవనంలో 'వినియోగదారుల రక్షణ చట్టం'పై జరిగిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. తరుగు పేరుతో బంగారు ఆభరాల షాపుల మోసాలపట్ల అప్రమత్తంగా ఉండాలని, మోసాలను బీఐఎస్, తూనికలు, కొలతల శాఖ దృష్టికి తీసుకెళ్లాని విజ్ఞప్తి చేశారు. ఆన్‌లైన్‌లో కొనుగోలుచేసిన వస్తు సేవల్లో లోపాలుంటే వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించి న్యాయం, నష్టపరిహారం పొందవచ్చన్నారు. ఏ.ఓంరాము అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో కార్యదర్శి ఎన్.ఏ.బి.వర్మ, డి.శివరాము, వంకాయల ఈశ్వర్రావు, బుద్ద అప్పారావు, డి.కాళిదాస్, వై.కేశవరావు, కె.రమణఅప్పారావు, శేషగిరిరావు, సాంబమూర్తిరాజు తదితరులు పాల్గొన్నారు. అనంతరం కాండ్రేగుల వెంకటరమణను ఘనంగా సత్కరించింది.

కాంగ్రెస్ లీగల్ సెల్ రాష్ట్ర కో-ఆర్డినేటర్‌గా అవినాష్

ప్రజాశక్తి -అనకాపల్లి : ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ ఆంధ్ర ప్రదేశ్ లీగల్ కో-ఆర్డినేటర్‌గా అనకాపల్లికి చెందిన యువ న్యాయవాది అవినాష్ ఇల్లాని నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు అవినాష్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ ఛైర్మన్ శశి థరూర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు.

చంద్రబాబుపై అక్రమ కేసులు అన్యాయం

ప్రజాశక్తి- కె.కోటపాడు : పుంగనూరు, అంగళ్ళ ప్రాంతాలలో రచ్చ చేసి, దాడులకు ఉసిగొల్పి, ఇప్పుడు తెలుగుదేశం అధినేత చంద్రబాబుపై కేసు నమోదు చేయించడం వైసిపి నాయకుల కుట్రలకు అద్దం పడుతోందని టిడిపి మాడుగుల నియోజకవర్గం నాయకులు పైలా ప్రసాదరావు విమర్శించారు. సాగునీటి ప్రాజెక్టుల విధ్వంసంపై చంద్రబాబు చేపట్టిన యుద్ధభేరితో వైసిపి నేతల వెన్నుల్లో వణుకు మొదలైందని పేర్కొన్నారు. ప్రజాక్షేత్రంలో చంద్రబాబు సంధించే ప్రశ్నలకు వైసిపి పెద్దలు సమాధానం చెప్పలేకపోతున్నారని, రోడ్ షోలకు, యువగళం పాదయాత్రకు వస్తున్న ప్రజాదరణ చూసి వారికి అసహనం పెరిగిపోతుందని ఆరోపించారు. అందుకే చంద్రబాబుపై తప్పుడు కేసులు పెట్టి తెలుగుదేశం శ్రేణులను భయపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. పుంగనూరు ఘటనపై విచారణ సిబిఐకు అప్పగిస్తే వైసిపి ప్రభుత్వం అసలు రంగు బయటపడుతుందని పైలా అన్నారు.

సంత వద్ద నిలిచిపోయిన అంబులెన్స్

అంబులెన్స్‌కు అవస్థలు

ప్రజాశక్తి - బుచ్చెయ్యపేట : రోడ్డుపై కూరగాయల సంత జరుగుతుండడంతో వాహనదారులతోపాటు, అంబులెన్సులు సైతం పలుమార్లు ఇబ్బందులకు గురవుతున్నాయి. నడిరోడ్డుపై సంత జరుగుతున్నా పంచాయతీ అధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు పడుతున్నారు. మండల కేంద్రం బుచ్చయ్య పేటలో ప్రతి బుధవారం మధ్యాహ్నం నుండి సాయంత్రం వరకు కూరగాయలు చికెన్, చేపలు, బట్టల దుకాణాలు ఏర్పాటు చేస్తారు. వ్యాపారాలన్నీ రోడ్డుకు ఇరువైపులా దుకాణాలు పెట్టడంతో వాహనాలు రాకపోకలకు కనీసం అవకాశం ఉండటం లేదు. బుధవారం సాయంత్రం 6 గంటల సమయంలో దిబ్బడి వైపు నుండి వస్తున్న అంబులెన్స్‌కు ఎదురుగా వాహనాల రావడంతో అంబులెన్స్ నిలిచిపోయింది. సంత మధ్యలో నుండి చివరి వరకు బస్సులు, వాహనాలు వెనుకకు నడపడంతో అంబులెన్స్‌కు దారి దొరికింది. వ్యాపారుల రోడ్డు మార్జిన్ దాటకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

'మంత్రి అమర్‌నాథ్ భూదాహాన్ని అడ్డుకున్నాం'

ప్రజాశక్తి-అనకాపల్లి : రాష్ట్ర పరిశ్రమల మంత్రి గుడివాడ అమర్నాథ్ భూ దాహాన్ని హైకోర్టులో అడ్డుకున్నట్లు టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రస్తుతం దొంగల రాజ్యం నడుస్తుందని అందిన వరకూ దోచుకోవడమే మంత్రుల అనుచరగణం పనిగా పెట్టుకున్నారని ఆరోపించారు. 13,500 మంది రైతుల శ్రమతో నిర్మితమైన అనకాపల్లి వివి రమణ చక్కెర ఫ్యాక్టరీని దొడ్డిదారిన ఫ్యాక్టరీ భూములను కాజేయాలని పరిశ్రమల మంత్రి గుడివాడ అమర్నాథ్ కుట్రను సమర్ధవంతంగా కోర్టు ద్వారా తిప్పుకొట్టామన్నారు. ఇది ఆరంభం మాత్రమేనని అసలైన కార్యాచరణ ఇప్పటినుండే మొదలవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హైకోర్టుకి వెళ్ళిన షేర్ హోల్డర్లు గొర్లి మోదీ నాయుడు, పూసపాటి విజయ గోపాల రాజు, బుద్ధ కాశి విశ్వేశ్వరరావు, పొలమరశెట్టి సూరిబాబు, మళ్ల కన్నుము నాయుడు, బుద్ధ భువనేశ్వర్ రావు, మళ్ల నూకరాజు, చవతిన అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక ఏఎంఏఎల్ కళాశాలలో అనకాపల్లి రెడ్ క్రాస్ సొసైటీ వారి ఆధ్వర్యంలో బుధవారం విశాఖపట్నం ఎల్వి ప్రసాద్ కంటి ఆసుపత్రి బృందం నేతృత్వంలో నేత్ర పరీక్షలు నిర్వహించారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్ స్వాములు, డాక్టర్ కౌసల్య ఆధ్వర్యంలో సాంకేతిక సిబ్బంది సుమారు 200 మందికి పైగా నేత్ర పరీక్షలు జరిపారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ జి రామ్మూర్తి, సెక్రటరీ వీరారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి జయబాబు, కళాశాల ఐ క్యు ఎసి కోఆర్డినేటర్ టి నిరంజన్ కుమార్, రెడ్ క్రాస్ సొసైటీ కోఆర్డినేటర్ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ బీమా డబ్బులు అందజేత

ప్రజాశక్తి - పరవాడ : మండలంలోని వాడచీపురుపల్లి శివారు గొల్లపేటగ్రామంలో బండి వరప్రసాద్ అనే వ్యక్తి మంగళవారం మరణించగా, వారి కుటుంబానికి వైఎస్సార్ బీమా లక్ష రూపాయలు మంజూరు అయ్యాయి. ప్రస్తుత దహన సంస్కార ఖర్చుల నిమిత్తం 10 వేలు రూపాయలు బుధవారం మీతుని భార్య బండి సత్యవేణికి వైఎస్ ఎంపిపి బుసి అప్పలరాజు అందించారు. ఈ కార్యక్రమాలో పిఎసిఎస్ ఛైర్మెన్ బురద రాజు, పెద్దింటి తాతాజీ, సెక్రటరీ మురళి పట్నాయక్ పాల్గొన్నారు

బీమా సొమ్ము అందజేస్తున్న వైస్ ఎంపిపి అప్పలరాజు తదితరులు

అల్లూరి స్మారక ప్రాంతాలపై ప్రభుత్వాల నిర్లక్ష్యం

పిసిసి రాష్ట్ర అధ్యక్షులు గిడుగు రుద్రరాజు

నివాళ్లు అర్పిస్తున్న రుద్రరాజు

ప్రజాశక్తి-గొలుగొండ:విప్లవవీరుడు అల్లూరి సీతారామ రాజు స్మారక ప్రాంతాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరించాయని పిసిసి రాష్ట్ర అధ్యక్షులు గిడుగు రుద్రరాజు ఆరోపించారు. బుధవారం ఆదివాసీ దినోత్సవం పురస్కరించుకొని గొలుగొండ మండలం కృష్ణదేవిపేట అల్లూరి పార్కును సందర్శించారు. ఈ సందర్భంగా అల్లూరి, గంటందొర సమాధులకు నివాళ్లు అర్పించారు. అనంతరం పార్కులో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా రుద్రరాజు మాట్లాడుతూ, నాలుగున్నరేళ్ల వైసిపి పాలనలో అల్లూరి పార్కును అభివృద్ధికి వైసిపి మంత్రులు లక్షల్లో నిధులు ప్రకటించడం తప్పా ఒక్క రూపాయి ఖర్చు చేసిన దాఖలాలు లేవన్నారు. గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన కట్టడాలు, మొక్కలు శిథిలమై ఉండటం కనిపించ లేదా అని ప్రశ్నించారు. ఆదివాసీ స్వాతంత్ర పోరాటయోధుల కుటుంబాలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలన్నారు. పార్కులో చేస్తున్న ముగ్గురు సంరక్షకులకు మూడున్నరేళ్లుగా పాత జీతాల బకాయిలు ఇవ్వకపోవడం దారుణమని తెలిపారు.అల్లూరి సమాధులున్న ప్రాంతాలపై ఇంత నిర్లక్ష్యం వహిస్తే రాష్ట్ర అభివృద్ధి ఏమి చేస్తారని ప్రశ్నించారు. ఇప్పటికైనా అల్లూరి స్మారక ప్రాంతాలను అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు జంగా గౌతమ్, మస్తాన్‌వలి, రాకేష్‌రెడ్డి, ఏఐసిసి జాతీయ కార్యదర్శి సిడి యేయప్ప, ఉమ్మడి విశాఖజిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రుత్తల శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

ఆకులు కట్టుకుని నిరసన చేపడుతున్న గిరిజనులు, నాయకులు

గిరిజనుల వినూత్న నిరసన

ప్రజాశక్తి -కోటవురట్ల:గిరిజన గ్రామమైన అణుకు ప్రాంతానికి రహదారి, పాఠశాల, మౌలిక వసతులు సౌకర్యం కల్పించాలని చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 34 రోజులు చేరుకున్నాయి. ఆదివాసి గిరిజన దినోత్సవ సందర్భంగా అనుకు గిరిజనులు ఆకులు ధరించి వినూత్న నిరసన చేపట్టారు. సిపిఎం నేత అప్పలరాజు మాట్లాడుతూ, గిరిజనుల న్యాయమైన కోర్కెలు నెరవేర్చి గ్రామానికి పాఠశాల, రహదారి సౌకర్యం కల్పించడంతో పాటు అంత్యోదయ కార్డులు అందజేయాలన్నారు. జగనన్న కాలనీ నిర్మాణం చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు డేవిడ్‌రాజు, సన్యాసిరావు, సూరిబాబు, రమేష్, రాజుబాబు తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైద్యులు

నులిపురుగులపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-గొలుగొండ:ఏఎల్‌పురం పిహెచ్‌సి వద్ద నులిపురుగుల దినోత్సవంపై డాక్టర్ హరిప్రవీణ్ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హరిప్రవీణ్ మాట్లాడుతూ, నులిపురుగుల నివారణకు ఒకటి నుంచి రెండు సంవత్సరాల పిల్లలకు సగం మాత్ర, రెండు సంవత్సరాల నుంచి 19 సంవత్సరాల వరకు పూర్తి మాత్ర, నాలుగు నెలలు దాటిన గర్భిణీలకు పూర్తి మాత్ర వేసుకోవాలన్నారు. భోజనం చేసిన అరగంట తర్వాత మాత్ర వేసుకోవాలన్నారు.

కోతుల స్వైర విహారం

పాదచారులు, వాహనదారులపై దాడులు

ప్రజాశక్తి-కోటవురట్ల:మండల పరిషత్ కార్యాలయం పరిసర ప్రాంతాల్లో గడిచిన ఏడాది కాలంగా కోతులు తిష్ట వేశాయి. దీంతో మండల పరిషత్ కాంప్లెక్స్ పరిధిలో ఉన్న గ్రంథాలయం, ఖజానా కార్యాలయం, పశువుల ఆసుపత్రి, మండల విద్యాశాఖ కార్యాలయం, ఉపాధి కార్యాలయం, వెలుగు కార్యాలయం, పిఆర్‌ఆర్ డబ్ల్యుఎస్ హౌసింగ్ ఇంజనీర్ల కార్యాలయాలు, భవిత కేంద్రం, పౌరసరఫరాల గోదాములకు కార్యాలయాలకు వచ్చే వారు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో మనుషులపై దాడికి యత్నిస్తుండటంతో భయాందోళన చెందుతున్నారు. వాహనాలను ధ్వంసం చేస్తూ.. వివిధ ఫలసాయం ఇచ్చే మొక్కలను ధ్వంసం చేస్తున్నాయి.కొన్ని సందర్భాల్లో కార్యాలయాల్లోకి ప్రవేశించి విలువైన వస్తువులను ధ్వంసం చేస్తున్నాయి. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోవాలని మండల వాసులు కోరుతున్నారు.

సంచరిస్తున్న కోతులు

పనులు ప్రారంభిస్తున్న జెడ్‌పిటిసి గిరిబాబు

రోడ్డు నిర్మాణానికి నిధుల మంజూరు

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని రేబాక పంచాయతీ శివారు తిరుపతిపాలెం నుంచి అల్లుమియ్య పాలెంకు రోడ్డు మంజూరైనట్లు సర్పంచ్ సాదిరెడ్డి శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, సుమారు నాలుగున్నర కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి ఏడు కోట్ల నిధులు ప్రభుత్వం మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే బాబురావు తెలియజేశారన్నారు. ఇప్పటివరకు రోడ్డు సక్రమంగా లేకపోవడంతో ఈ ప్రాంత ప్రజలు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడే వారిని, నిధులు మంజూరు కావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీనివాసరావు, వెల్లంకి కాసుబాబు పాల్గొన్నారు .

మాట్లాడుతున్న నాయకులు

కల్వర్టు పనులు ప్రారంభం

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని పుత్తడి గైరంపేట పంచాయతీ శివారు పల్లపు నాగేంద్రపాలెం, నర్సీపట్నం రోడ్డు మధ్యలో ఇటీవల కురిసిన వర్షాలకు కల్వర్టు కూలిపోయింది. జెడ్పీటీసీ నిధులు రూ.4.50లక్షలు మంజూరు చేయడంతో బుధవారం ఈ పనులను జెడ్పీటీసీ గిరిబాబు ప్రారంభించారు. ఈ కల్వర్టు నిర్మాణంతో సుమారు ఐదు గ్రామాల ప్రజల కష్టాలు తీరుతాయని, నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే గణేష్‌కు, జెడ్పీటీసీ గిరిబాబుకు ప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌అండ్‌బి డిఇ ఈశ్వరరావు, పుత్తడిగైరంపేట సర్పంచ్ పత్తి రమణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అధికారులు, నాయకులు

అంగన్వాడి కేంద్రం సందర్శన

ప్రజాశక్తి- నక్కపల్లి:మండలంలోని చందనాడ గ్రామంలో అంగన్వాడీ కేంద్రాన్ని బుధవారం ఎంపీపీ రత్నం, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, జడ్పిటిసి కాసులమ్మ, వైస్ ఎంపీపీ నానాజీ, సర్పంచ్ రోహిణి భర్త భార్గవ్, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఏవో సీతారామరాజు సందర్శిం చారు. రికార్డులను పరిశీలించారు. పోషకాహారం పై గర్భిణీలకు, బాలింతలకు అవగాహన కల్పించాలన్నారు.

పోషకాహార కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-కోటవురట్ల:ప్రభుత్వం బాలింతలకు, గర్భిణీలకు అందిస్తున్న వైయస్సార్ పోషకాహారాన్ని సద్వినియోగించు కోవాలని పి.కొత్తపల్లి సర్పంచ్ ఏలగాడ బెన్నమ్మ కోరారు. బుధవారం గ్రామంలో వైఎస్ఆర్ పోషకాహార కిట్లు అందజేశారు. ఈ కిట్లలోని పదార్థాలను గర్భిణులు, బాలింతలు తీసుకోవాలని సూచించారు. వీటిలో పలు రకాల పోషక విలువలు ఉన్న పదార్థాలు ఉంటాయన్నారు. ఎఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్, సచివాలయ సిబ్బంది, వైసిపి నాయకుడు పాల్గొన్నారు.

పోషకాహార కిట్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్

నిర్మానుష్యంగా ఉన్న రోడ్డు

వేసవిని తలపిస్తున్న ఎండలు

ఆందోళనలో రైతన్నలు

ప్రజాశక్తి -కోటవురట్ల:గడిచిన కొన్ని రోజులుగా ఎండల తీవ్రతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. వేసవి కాలం మాదిరిగా ఉదయం 11 గంటలకే రోడ్లన్నీ నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి. ఎండలతో పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెలరోజులు దాటినా పూర్తి స్థాయిలో వరి నాట్లు వేసిన దాఖలాలు లేవు. బోరుబావి సమీపంలో వేసిన కొద్దిపాటి నాట్లు సైతం నెర్రలు వేస్తున్నాయి. కొన్నిచోట్ల వరి నారుమడులు సైతం ఎండిపోతున్నాయి. పశుగ్రాసం కొరతతో రైతులు అవస్థలు పడుతున్నారు.

పలు చోట్ల మొక్కలు నాటివేత

ప్రజాశక్తి -నక్కపల్లి:నా మట్టి నా దేశంలో భాగంగా మండలంలోని చందనాడ గ్రామంలో బుధవారం రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ఎంపీపీ రత్నం, వైస్ ఎంపీపీ నానాజీ, జడ్పిటిసి సభ్యురాలు కాసులమ్మ, సర్పంచ్ రోహిణి భర్త తళ్ళ భార్గవ్, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఏవో సీతారామరాజు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు కొప్పిశెట్టి హరిబాబు పాల్గొన్నారు .

కోటవురట్ల:మండలంలో లింగాపురం, వెంకటా పురం, కోటవురట్ల, కొడవటిపూడి ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు, అధికారులు నా మట్టి నా దేశం కార్యక్రమం చేపట్టారు. ఈఓపిఆర్‌డి సుబ్రహ్మణ్యం, ఏపీవో గంగు నాయుడు పాల్గొన్నారు.

గొలుగొండ:మండలంలోని పుత్తడిగైరంపేట పంచాయతీ సచివాలయంలో నా భూమి నా దేశం కార్యక్రమంలో భాగంగా అమరవీరులకు నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ పత్తి రమణ, విఆర్ఓ ధారబాబు, ఉపాధి హామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్, విఆర్పి రాజేశ్వరి, సచివాలయం కార్యదర్శి ఎం.రాజు పాల్గొన్నారు.

రోలుగుంటలో మొక్కను నాటుతున్న అధికారులు

కృష్ణదేవిపేట అల్లూరి పార్కులో నర్సీపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ చిటికెల బాస్కర్‌నాయుడు, జిల్లా వైసిపి ఎస్సీ సెల్ అధ్యక్షురాలు, ఏఎల్‌పురం సర్పంచ్ లోచల సుజాత. ఉపాధి హామీ ఈసీ రాధిక, సెక్రటరీ శ్రీనివాస్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు. లింగంపేట గ్రామంలో సర్పంచ్ సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి అప్పారావు, గొంతిన ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

రోలుగుంట:స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి యర్రంశెట్టి శ్రీనివాసరావు, ఎంపిడిఓ కె.ప్రభాకర్, ఏపిఓ సూర్యమణి, ఇన్‌చార్జ్ ఈఓపిఆర్‌డి రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని త్యేగాడ, కొత్తపల్లి, బుచ్చయ్యపేట గ్రామంలో బుధవారం నాభూమి-నాదేశం కార్యక్రమంలో భాగంగా ఎంపిపి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ వివి రవికుమార్, సర్పంచ్‌లు నీటిపల్లి ఈశ్వరమ్మ, కరణం శ్యామ్‌సన్, కోన నాయుడు, ఎపిఓ శివ, సచివాలయం కార్యదర్శులు నాగేశ్వరరావు, సాయి ప్రియ, వైసిపి నాయకులు అద్దేపల్లి శ్రీను పాల్గొన్నారు.

చోడవరం : గోవాడ గ్రామపంచాయతీలో చోడవరం మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు ఆధ్వర్యాన సర్పంచ్ ఏడువాక అమ్మియ్యమ్మ మొక్కలు నాటారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జే.దుర్గా ప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ జి.అప్పారావు, మోదకొండ పాల్గొన్నారు.

దేవరాపల్లి : మండల కేంద్రంలోని హౌసింగ్ కార్యాలయం పక్కన ఎంపీడీవో సిహెచ్.సుబ్బలక్ష్మి ఆధ్వర్యంలోఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, జడ్పిటిసి కర్రి సత్యం మొక్కలు నాటారు. కార్యక్రమంలో తహాశీల్దార్ ఎమ్.లక్ష్మి, వైద్య అధికారి ఎస్.లలిత, ఇన్‌ఛార్జి ఎంఈఓ బి.పడాల దాసు, ఎంఈఓ-2 వి.ఉషారాణి, ఏపీవో సూర్య కళ, వెలుగు ఏపిఎం ప్రభాకరరావు, పంచాయతీ ఈవో ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నామినేషన్ దాఖలు చేస్తున్న మహిళ

నామినేషన్లు దాఖలు

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలో రేబాక పంచా యతీలో 3వ వార్డుకు సంబంధించి బుధవారం ఒక నామినేషన్ దాఖలు అయినట్లు ఆర్వో డి సత్యనారాయణ, ఏవో సీతారామరాజు వెల్లడిం చారు. రేబాక పంచాయతీ సర్పంచ్ సాదిరెడ్డి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ నానాజీ, ఉప సర్పంచ్ శ్రీనివాసరావు, వి.కాసుబాబు చేతుల మీదుగా నామినేషన్ పత్రాన్ని ఆర్ఓకు అందజేశారు. మండలంలోని చిన్నదొడ్డిగల్లులో 1వ వార్డు, రేబాక పంచాయతీలో 3వ వార్డు ఖాళీ ఏర్పడటంతో ఉప ఎన్నికలు జరగనున్నాయి. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కిరణ్ పాల్గొన్నారు .

గొలుగొండ:మండలంలో వార్డు మెంబర్ల ఉప ఎన్నిక నిమిత్తం బుధవారం ఒక నామినేషన్ దాఖలైందని ఎంపిడిఒ డేవిడ్‌రాజు తెలిపారు. మండలంలో సిహెచ్.నాగాపురం పంచాయతీలో ఎస్సీ రిజర్వేషన్‌కు కేటాయించిన వార్డు మెంబర్ స్థానానికి జుర్రా కుమార్ నామినేషన్ దాఖలు చేశారు. గాదంపాలెం పంచాయతీలో ఒక వార్డు మెంబర్‌కు ఎన్నిక జరగాల్సి ఉండగా ఇంకా నామినేషన్లు దాఖలు కాలేదని ఎంపిడిఒ తెలిపారు.

నిరసన చేపడుతున్న నాయకులు

కులమత నిర్మూలన చేయాలి

ప్రజాశక్తి-కలెక్టరేట్ (విశాఖ) : క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో దేశంలో కుల వివక్ష, మతతత్వ నిర్మాలనకు మేధావులు, అభ్యుదయ, ప్రజాతంత్ర వాదులు ప్రజల సహకారంతో కార్యక్రమాలు నిర్వహించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్), దళిత హక్కుల పోరాటసమితి (డిహెచ్‌పిఎస్) నేతలు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం ఎల్ఐసి సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ నాయకులు ఎం.సుబ్బన్న, డిహెచ్‌పిఎస్ నాయకులు జెవి.ప్రభాకర్ మాట్లాడుతూ, దేశ ప్రజల స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం భారత దేశ ప్రజలు జరిపిన పెద్ద ఉద్యమం క్విట్ ఇండియా ఉద్యమం అన్నారు. నేడు దేశ ప్రజల ప్రయోజనాల కోసం కాకుండా, అధికారాన్ని నిలబెట్టుకోవడం కోసం కులమతాలను రెచ్చకొట్టి విద్వేషాన్ని రగిలించారని విమర్శించారు. ఎక్కడ అల్లర్లు చెలరేగినా మొట్టమొదట బలయ్యేవారు దళితులు, గిరిజనులు, మైనారిటీలు మహిళలు, బలహీన వర్గాల వారే అని చెప్పారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు టి.చిరంజీవి, వై.రాజు, వి.రాంబాబు, సోడదాసి సుధాకర్, గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె. సత్యనారాయణ పాల్గొన్నారు.

నవంబర్ 5న వైజాగ్ నేవీ మారథాన్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ

వైజాగ్ నేవీ మారథాన్‌ను ఈ ఏడాది నవంబర్ 5వ తేదీన నిర్వహించనున్నట్లు వైజాగ్ నేవీ మారథాన్ రేస్ డైరెక్టర్ వెంకటరామన్ తెలిపారు. బుధవారం సాయంత్రం డాల్ఫిన్ హోటల్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో వైజాగ్ నేవీ మారథాన్ 8వ ఎడిషన్‌కు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. 2014 నుంచి ఈ మారథాన్‌ను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో పాల్గొనాలనుకునే వారు vizagnavy-marathon.runలో రిజిస్టర్ చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ ఏడాది మారథాన్‌ను నాలుగు రన్స్ కేటగిరిల్లో నిర్వహిస్తున్నమని తెలిపారు.

కార్పొరేట్లకు ఊడిగం చేస్తున్న మోడీ ప్రభుత్వం

-'క్విట్ ఇండియా' ఉద్యమ స్ఫూర్తితో పలు చోట్ల నిరసనలు

జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద మాట్లాడుతున్న సిహెచ్.నర్సింగరావు

ప్రజాశక్తి-యంత్రాంగం

దేశ సమైక్యత, సమగ్రతల పరిరక్షణ కోసం ఆగస్టు 9 'క్విట్ ఇండియా' ఉద్యమ స్ఫూర్తితో 'క్విట్ కార్పొరేట్, సేవ్ ఇండియా' పేరుతో కార్మిక, ఉద్యోగ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు.

అనకాపల్లి:కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తుందని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.లోకనాథం అన్నారు. దేశ సమైక్యత, సమగ్రతల పరిరక్షణ కోసం ఆగస్టు 9 'క్విట్ ఇండియా' ఉద్యమ స్ఫూర్తితో 'క్విట్ కార్పొరేట్, సేవ్ ఇండియా' పేరుతో కార్మిక, ఉద్యోగ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అనకాపల్లి నెహ్రూచౌక్ జంక్షన్ బస్టాప్ వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ కీలక రంగాలతో సహా ప్రతి ప్రభుత్వ రంగ సంస్థను ప్రైవేటీకరణ చేయడానికి మోడీ ప్రభుత్వం పూనుకుందన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా 900 రోజులుగా కార్మికులు పోరాడుతున్నా కేంద్ర వెనక్కి తగ్గలేదని పేర్కొన్నారు. కార్పొరేట్లకు అనుకూలంగా కార్మిక చట్టాలను సవరించిందన్నారు. అఖిలభారత సమ్మెలతో పాటు అనేక పోరాటాలు చేస్తున్న కార్మిక సంఘాలను పిలిచి చర్చించాలన్న ఇంగిత జ్ఞానం కూడా మోడీ ప్రభుత్వానికి లేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ విధానాల వలన ధరలు ఆకాశానికి అంటి, వేతనాలు పాతాళానికి దిగిపోతున్నాయని, పేదరికం, ఆకలి, నిరుద్యోగం పెరుగుతోందని, సంపద మొత్తం అదాని, అంబాని వంటి కొంతమంది కార్పొరేట్ల చేతుల్లో పోగుపడి ఆర్థిక సంక్షోభాలకు దారి తీస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. బిజెపి ప్రభుత్వం కొనసాగితే అన్ని వర్గాల ప్రజలకు తీవ్ర నష్టమన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్.శంకర్రావు, వివి.శ్రీనివాసరావు, గనిశెట్టి సత్యనారాయణ, భీశెట్టి అప్పారావు, బి.ఉమామహేశ్వరరావు (సిఐటియు), వైఎన్.భద్రం, తాకాశి వెంకటేశ్వరరావు (ఏఐటియూసి) శ్రీరామ్మూర్తి (తెలుగు రైతు), గంటా శ్రీరామ్ (చేతివృత్తుల సమన్వయ కమిటీ), రెడ్డిపల్లి అప్పలరాజు, కోరిబిల్లి శంకరరావు (ఏపీ రైతు సంఘం), బాలు గాడి (రైతు స్వరాజ్య వేదిక), కొణతాల హరినాథ్ బాబు (ఆప్), కర్రి అప్పారావు, గండి నాయన బాబు (రైతు సంఘం), రాజాన దొరబాబు (వ్యవసాయ కార్మిక సంఘం) ఐఆర్ గంగాధర్ (కాంగ్రెస్), సూదికొండ మాణిక్యాలరావు (బిఎస్‌పి), ఎం.నాగ శేషు (శ్రామిక మహిళ సమన్వయ కమిటీ), డిడి.వరలక్ష్మి (ఐద్వా), ఎ.బాలకృష్ణ (కౌలు రైతు సంఘం) పాల్గొన్నారు.

నర్సీపట్నంటౌన్: క్విట్ ఇండియా స్ఫూర్తితో మోడీని ఓడిద్దామని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి. కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. అఖిలపక్ష కార్మిక సంఘాల పిలుపులో బాగంగా స్థానిక ఆర్డీఓ కార్యాలయం వద్ద బుధవారం నిరసన దీక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణను తక్షణమే కేంద్రం ఆపాలని, కనీస వేతనం రూ.26,000 అమలు చేయాలన్నారు. స్కీమ్ వర్కర్స్‌ను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, వివిధ ప్రభుత్వరంగ సంస్థల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేవారు. కనీస పెన్షన్ రూ.9,000 చెల్లించాలని, అసంఘటిత రంగ కార్మికులకు పిఎఫ్, ఇఎస్ఐ, ఇన్యూరెన్స్‌తో కూడిన సమగ్ర చట్టం చేయాలన్నారు. ఉపాధి హామీ పని దినాలు 200రోజులకు పెంచాలన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను మోడీ ఆప్త మిత్రులైన అంబానీ, ఆదానీలకు కట్టబెడుతున్నారని దుయ్యబట్టారు. స్టీల్ ప్లాంట్, పోర్టులు, విమానాశ్రయాలు, రైల్వేలు, బ్యాంకులను ప్రైవేటీకరణకు పూనుకుంటున్నారని విమర్శించారు.

రైతు సంఘం జిల్లా కార్యదర్శి యం.అప్పలరాజు మాట్లాడుతూ, పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో మోడీ ప్రభుత్వం దగా చేసిందన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల అమలు చేయాలని, రైతుల రుణాలు మాఫీ చేయాలనీ డిమాండ్ చేశారు. రైతు కూలి సంఘం నాయకులు అజయ్ కుమార్ మాట్లాడుతూ, మోడీ ప్రభుత్వం కార్పొరేట్‌లకు ఊడిగం చేస్తూ పేదలపై భారాలు మోపుతుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు అడిగర్ల రాజు, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఇ.చిరంజీవి, ఐద్వా నాయకులు కెవిఎస్ ప్రభ, ఎల్.గౌరీ, వ్యవసాయం సంఘం నాయకులు సత్తిబాబు, డేవిడ్, రైతు నాయకులు మేక సత్యనారాయణలు ప్రసంగించారు

నర్సీపట్నం టౌన్ : స్థానిక అబీద్ సెంటర్లో అంబేద్కర్ విగ్రహం వద్ద కేవీపీఎస్ నాయకులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కేవిపిఎస్ కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి మాట్లాడితూ, స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు గడుస్తున్నా కుల నిర్మూలన జరగలేదన్నారు. ఇప్పటికీ దళిత, గిరిజనులపై దాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

తగరపువలస : క్విట్ మోడీ, సేవ్ ఇండియా నినాదంతో కేంద్ర ప్రభుత్వ విధానాలపై పోరాడాలని సిఐటియు భీమిలి జోన్ అధ్యక్షులు ఆర్ఎస్ఎన్ మూర్తి పిలుపు నిచ్చారు. బుధవారం స్థానిక సిఐటియు కార్యాలయం నుంచి మార్కెట్ వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. మోడీ తొమ్మిదేళ్ల పాలనలో కార్మికులకు ఒరిగిందేమీ లేదన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రవ్వ నరసింగరావు, ముఠా కార్మికులు ఈశ్వరరావు, రీసు చిన్నారావు పాల్గొన్నారు

గాజువాక : భెల్ మెయిన్ గేటు వద్ద సిఐటియు, ఎఐటియుసి సంయుక్త ఆధ్వర్యాన క్విట్ ఇండియా స్ఫూర్తితో కేంద్ర ప్రభుత్వకార్మిక వ్యతిరేక విధానాలకు నిరసన చేపట్టారు.కార్యక్రమానికి అధ్యక్షత వహించి, జిటిపి ప్రకాష్ మాట్లాడుతూ, ప్రభుత్వ విధానాలతో పోరాడి సాధించుకున్న ప్రభుత్వ రంగ సంస్థలు నాశనమౌతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బిహెచ్‌పివిని భెల్‌లోకి విలీనానికి ఎన్నో పోరాటాలు చేసామని, అయినా భెల్‌లో ఇంకా ప్రైవేట్ షేర్లు ఉన్నాయన్నారు. గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శి, వి బాబూరావు మాట్లాడుతూ, నాడు నెహ్రూ హయాంలో ప్రభుత్వ రంగ సంస్థలు స్థాపిస్తే, నేడు మోడీ ప్రభుత్వం వాటిని ప్రయివేటు పరం చేస్తోదన్నారు.కార్యక్రమంలో, వి ఆనందరావు, ఎస్ జగన్నాధ రావు, సీతమ్మ నాయుడు, ఎస్ అప్పారావు, ఎస్ ఎల్ నరసింహులు, చిట్టిబాబు, మురళీ శ్వరరావు, కే నారపరెడ్డి పాల్గొన్నారు.

అనకాపల్లిలో మాట్లాడుతున్న లోకనాథం

నర్సీపట్నంలో చేపడుతున్న ర్యాలీ

మణిపూర్ హింసాకాండపై మోడీ స్పందించాలి

ప్రజాశక్తి-కలెక్టరేట్ (విశాఖ) : మణిపూర్ హింసాకాండపై ప్రధాని మోడీ స్పందించి అక్కడ ప్రజలను రక్షించాలని, ముఖ్యంగా మహిళలను, పిల్లలను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం సిఐటియు విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కెఎం.శ్రీనివాసరావు, ఆర్‌కెఎస్‌వి.కుమార్, ఉపాధ్యక్షులు పి.మణి మాట్లాడుతూ, మే 4న మణిపూర్‌లో కూకీ మహిళలను నగ్నంగా ఊరేగించడం దేశాన్ని ఉలిక్కిపడేలా చేసిందన్నారు. ఈ ఘటన జరిగి 95 రోజులు కావస్తున్నా కేంద్ర బిజెపి ప్రభుత్వం, మణిపూర్ రాష్ట్ర బిజెపి ప్రభుత్వం చేపట్టిన చర్యలు నామమాత్రం అన్నారు. ప్రపంచంలో మన దేశ స్థాయిని దిగజార్చిన ఈ ఘటనపై ప్రధాని మోడీ పార్లమెంట్‌లో స్పందించకపోవడం, మణిపూర్‌ను సందర్శించకపోవడం దోషులకు బలాన్ని ఇస్తుందన్నారు. కార్పొరేట్లకు మణిపూర్ ఖనిజ సంపదను దోచిపెట్టేందుకే తెగల మధ్య మతం పేరుతో ఘర్షణలను అక్కడ మతన్మోదశక్తులు చేపట్టాయని విమర్శించారు. ఈ శక్తులకు అన్ని రకాల అండదండలు బిజెపి నుంచి లభిస్తున్నాయన్నారు. ఉన్మాద రాజకీయాలను ఆపకుంటే దేశవ్యాప్తంగా పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కె.సత్యవతి, బి.రత్నం, వై.తులసి, ఆర్.శోభారాణి, ఎస్.పద్మ, వి.మేరీ, వై.సీతారత్నం, జి.మంగశ్రీ, సావిత్రి, లక్ష్మి, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నిరసన చేపడుతున్న మహిళలు

ఈ పంట నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి-కోటవురట్ల: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులు ఈ పంటలను నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారిని సరోజిని తెలిపారు. బుధవారం ఆమె స్థానిక రైతు భరోసా కేంద్రంలో మాట్లాడుతూ, పంటకు కావలసిన ఎరువులు, క్రిమిసంహారక మందులు, ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తే నష్టపరిహారం, 0 వడ్డీ రుణాలు వంటి పథకాలను ఈ పంట నమోదుతోనే అందిస్తుందన్నారు.

విద్యుత్ అంతరాయంతో ఇక్కట్లు

ప్రజాశక్తి-మాడుగుల:నిరంతర విద్యుత్ కోతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధిక లోడ్ కారణంగా ట్రిప్ అవుండటంతో విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందని సిబ్బంది చెపుతున్నారు. మంగళవారం రాత్రి పలు మార్లు విద్యుత్ సరఫరా నిలిచి పోవడంతో ఉక్క పోత తో ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు.ఎండలు,అధిక ఉష్ణోగ్రత, ఉక్క పోతతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ వినియోగం పెరగడం, ఇతర కారణాలతో కొద్ది రోజులుగా ఇదే పరిస్థితి కొనసాగుతుంది.